# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
మంగళవారం 29 సెప్టెంబర్ 2026
పేజీలు : 8

# ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడేందుకు ముఖ్య

# ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి



- డిసిసి అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్
- ఎస్ ఐ ఆర్ అవక తవకల పై కాంగ్రెస్ మహాధర్నా
- జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి భారి ర్యాలీ
- కలేక్టరేట్ వద్ద బైటాయింపు
- ఈసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- సి ఈ సి జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టి బొమ్మ దహానానికి యత్నం
- అడ్డుకున్న పోలీసులు

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి



- కలెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి
- ఫుడ్ పాయిజనింగ్, పాముకాటు వంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా చర్యలు



# నస్పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

## ముగ్గురు మహిళల దుర్మరణం...

ఆటోను ఢీకొన్న టిప్పర్ లారీ.. నుజ్జునుజ్జయిన ఆటో

మృతుల్లో మందమర్రి మండలం గుడిపల్లికి చెందిన రవళి, రమ్య, సౌందర్య



# ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబం కల






**ఆ కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యము**

**మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు**

**రెండు పడకల ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక**

**మంచిర్యాల, 28,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని షాదీఖానా మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండు పడకల ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహించిన లక్కీ డ్రా కార్యక్రమంలో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఇల్లు అనేది ప్రతి పేద కుటుంబం కల అని, ఆ కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా, న్యాయబద్ధంగా ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా ఎంపికైన లబ్ధిదారుల కుటుంబాల్లో సొంతింటి ఆనందం వెల్లివిరియాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మంచిర్యాల ఎంఆర్ఓ రఫతుల్లా, మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజు, సంబంధిత అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఐకే-1ఏ పిట్ కమిటీ సభ్యుల ఎన్నిక



**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**ఐకే-1ఏ పిట్ కమిటీ సభ్యత్వ సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజా రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పిట్ కమిటీ నూతన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా నరెడ్ల వెంకటరెడ్డి, కిషన్ రెడ్డి, బోడకుంట శంకర్ ఎన్నికయ్యారు. పిట్ సెక్రటరీగా అఖిల్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ, చీఫ్ ఆర్గనైజర్‌గా బొజ్జ నవీన్, అసిస్టెంట్ పిట్ సెక్రటరీ, జనరల్ షిఫ్ట్‌గా పోతరాజుల అనిల్ కుమార్ నియమితులయ్యారు. అసిస్టెంట్ పిట్ సెక్రటరీలు, షిఫ్ట్ ఇన్‌చార్జిలుగా డీ-రిలేకు పి. శ్రీనివాస్, బీ-రిలేకు ప్రశాంత్, సీ-రిలేకు అమర్‌లను నియమించారు. ఆర్గనైజర్ సెక్రటరీగా ఖాదిర్ ఎన్నికయ్యారు. అదేవిధంగా ముఖ్య డెలిగేట్లుగా సుధీర్, తిరుపతి, కొమురయ్య, రవీందర్, శ్రీనాథ్, సాయి కుమార్, గోలి సాయి, ప్రకాష్, చంద్రశేఖర్, పాశం శ్రీనివాస్, నాగరాజు, సంబారి శంకర్లను నియమించారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన పిట్ కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

## సీసీ నస్పూర్ జాతీయ రహదారి ప్రమాదం బాధాకరం

**మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది**

**ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సీసీ నస్పూర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత బాధాకరమని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు గడ్డం వంశీకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని, బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని ఎంపీ తెలిపారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులతో మాట్లాడి తెలుసుకున్నట్లు తెలిపారు . భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సీసీ నస్పూర్ జాతీయ రహదారిపై తక్షణ భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు వంశీకృష్ణ తెలిపారు. అదేవిధంగా మంచిర్యాల మెడికల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా, వారికి అవసరమైన అన్ని సహాయ చర్యలను దగ్గరుండి పర్యవేక్షించాలని సంబంధిత అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు .ఈ ప్రమాదంలో ముగ్గురు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని ఎంపీ అన్నారు. ఇలాంటి విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ రహదారులపై ప్రయాణించే సమయంలో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ జాగ్రత్తగా ప్రయాణించాలని ఎంపీ గడ్డం వంశీకృష్ణ విజ్ఞప్తి చేశారు.

## బాధితుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించుకోవాలి

**రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**





**మంచిర్యాల, 28,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**ప్రజలు, బాధితులు తమ సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించుకునేందుకు పోలీసులను ఆశ్రయించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. సోమవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన కమిషనర్, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, చట్టపరమైన నిబంధనల మేరకు సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీసీ నస్పూర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

**లారీ--ఆటో ఢీ.. ముగ్గురు మహిళలు మృతి**

**మృతుల కుటుంబాలకు రూ.25 వేల చొప్పున..**

**క్షతగాత్రులకు రూ.10 వేల చొప్పున మంత్రి వ్యక్తిగత సాయం**

**మంచిర్యాల, 28,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. లారీ--ఆటో ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మృతులను చెన్నూర్ నియోజక వర్గం మందమర్రి మండలానికి చెందిన మహిళలుగా గుర్తించారు. ప్రమాద ఘటనపై శక్తి, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.25 వేల చొప్పున, తీవ్రంగా గాయపడిన ముగ్గురు క్షతగాత్రులకు రూ.10 వేల చొప్పున తన వ్యక్తిగతంగా తక్షణ ఆర్థిక సాయం అందించనున్నట్లు మంత్రి ప్రకటించారు.



# నస్పూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మహిళల దుర్మరణం...

### ఆటోను ఢీకొన్న టిప్పర్ లారీ.. నుజ్జునుజ్జయిన ఆటో

### మృతుల్లో మందమర్రి మండలం గుడిపల్లికి చెందిన రవళి, రమ్య, సౌందర్య

**మంచిర్యాల, 28,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**మంచిర్యాల జిల్లా నస్పూర్ ప్రాంతంలో సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జాతీయ రహదారిపై జరిగిన ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలు మృతి చెందారు. మృతులను మందమర్రి మండలం గుడిపల్లికి చెందిన రవళి, రమ్య, సౌందర్యగా గుర్తించారు. వీరంతా నస్పూర్ ప్రాంతంలోని ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్నట్లు తెలిసింది. ప్రతిరోజులాగే సోమవారం ఉదయం పనికి వెళ్లేందుకు ఆటోలో ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఆటో తన మార్గంలో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొనడంతో ప్రమాదం సంభవించింది. ప్రమాదం ధాటికి ఆటో పూర్తిగా నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

**సీసీటీవీ దృశ్యాల పరిశీలన**

ప్రమాదానికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. ఆటో తన మార్గంలో వెళ్తున్న సమయంలో ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టినట్లు దృశ్యాల ద్వారా స్పష్టమైనట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీపీ**

ప్రమాద సమాచారం తెలుసుకున్న రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్ తదితరులతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాద పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి గల కారణాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, భవిష్యత్‌లో




ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను సీపీ ఆదేశించారు.

**మంత్రి వివేక్ వెంకటస్వామి దిగ్భ్రాంతి**

ముగ్గురు మహిళలు చెన్నూరు నియోజకవర్గానికి చెందినవారిగా సమాచారం అందడంతో చెన్నూరు ఎమ్మెల్యే, మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు వ్యక్తిగతంగా రూ.25 వేల చొప్పున, క్షతగాత్రులకు రూ.10 వేల చొప్పున తక్షణ సాయం ప్రకటించారు. మృతుల పార్థివదేహాలను, క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వద్ద మృతుల కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఘటనతో గుడిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# వయోధికుల వాహనాలకు ప్రత్యేక స్టిక్కర్లు

**వయోధికులను గుర్తించండి.. గౌరవించండి.. భద్రత కల్పించండి**

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):**డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఘట్‌కేసర్ మున్సిపల్ కేంద్రంలో సీనియర్ సిటీజన్స్ వాహనాలకు ప్రత్యేక స్టిక్కర్లను ఆవిష్కరించి, వయోధికులకు పంపిణీ చేశారు. సీనియర్ సిటీజన్స్ వాహనాలను ఇతర వాహనదారులు ముందుగానే గుర్తించి అప్రమత్తంగా ఉండేలా ఈ స్టిక్కర్లను రూపొందించినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు తోట రంగయ్య మాట్లాడుతూ, వయోధికులు సమాజానికి ఎంతో విలువైన సంపద అని అన్నారు. వారు వాహనాలు నడుపుతున్న సమయంలో ఇతర వాహనదారులు సంయమనం పాటించి, వారి వయస్సును దృష్టిలో ఉంచుకుని సహకరించాలని కోరారు. రహదారులపై సీనియర్ సిటీజన్స్ పట్ల గౌరవం, మానవత్వంతో వ్యవహరించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ మాట్లాడుతూ, దేశాభివృద్ధికి పునాదులు వేసిన వయోధికులను సమాజం చిన్నచూపు చూడకూడదన్నారు. కొందరు యువ వాహనదారులు సీనియర్ సిటీజన్స్ వాహనాలను అత్యంత వేగంగా ఓవర్‌టేక్ చేయడం, అకస్మాత్తుగా ముందుకు రావడం, మోడిఫైడ్ హారన్లతో అధిక శబ్దం చేయడం వల్ల వయోధికులు భయాందోళనలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలు వయోధికుల భద్రతకు




ముప్పుగా మారుతున్నాయని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సీనియర్ సిటీజన్స్‌కు సహకరించాలని కోరారు రోడ్డు ప్రమాదాల్లో సీనియర్ సిటీజన్స్ ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. "వయోధికులను గుర్తించండి -- గౌరవించండి -- భద్రత కల్పించండి" అనే సందేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ముత్యాల గౌడ్, కార్యవర్గ సభ్యులు వి. వెంకట్రామిరెడ్డి, ఇన్నారెడ్డి, సోమయ్య, టి. కృష్ణమూర్తి, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జి.వి. రాజిరెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రభాకర్ గౌడ్, చలపతి, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## 30 న రవీంద్రభారతి ముట్టడిని విజయవంతం చేయాలి.



**జన్నారం,సెప్టెంబర్28(ప్రజాజ్యోతి)** సాంస్కృతిక సారథిలో ఉద్యోగాల సాధనకై తెలంగాణ ఉద్యమ కళాకారుల సంఘం వ్యవస్థాపకులు అవునోజు వెంకన్న ఆధ్వర్యంలో ఈ నెల 30 న నిర్వహించే రవీంద్ర భారతి ముట్టడి కార్యక్రమానికి పెద్ద ఎత్తున తెలంగాణ ఉద్యమ ధూంధాం కళాకారులంతా ఓవద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యమకారుల సంఘం రాష్ట్ర నాయకులు కొండుకూరి రాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఉద్యమ కళాకారులంతా శాంతియుతంగా ఎందరో ఎమ్మెల్యేలను, ఎంపీలను, మంత్రులను కలిసినగానీ నిమ్మకు నీరెత్తిన విధంగా వ్యవహరిస్తున్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిజమైన కళాకారులందరూ ఈరోజు పని పాట లేకుండా పూట గడవని స్థితిలో రోజులు గడుపుతున్నారని అన్నారు. ఉద్యోగాలు వచ్చుడా-కళాకారులు చచ్చుడా అనే నినాదంతో ఈ నెల 30న చేస్తున్న రవీంద్ర భారతి ముట్టడి కార్యక్రమానికి కళాకారులంతా పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో లింగంపెల్లి రాజలింగం,సత్తయ్య,శ్రావణ్,శ్రావణి,మనోజ్ కుమార్, రాజేందర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు

## టైగర్ జోన్ రద్దుకై సెప్టెంబర్ 30న 'జన్నారం బంద్'

**జన్నారం,సెప్టెంబర్ 28(ప్రజాజ్యోతి)**




జన్నారం డివిజన్ లోని కవ్వాల్ టైగర్ జోన్ వల్ల స్థానిక ప్రజలు,రైతులు మరియు వ్యాపారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను నిరసిస్తూ, ఎకో సెన్సిటివ్ జోన్‌ను ఎత్తివేసి టైగర్ జోన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సామాజిక పోరాట సమితి నాయకులు శ్రీరాముల భూమాచారి చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారం నాటికి 37 రోజులకు చేరుకుంది. కవ్వాల్ అడవికి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నా పులుల స్థిర నివాసం లేకపోయినా, నిబంధనల పేరుతో సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గత 37 రోజులుగా దీక్ష చేస్తున్నప్పటికీ ప్రభుత్వం మరియు అటవీ శాఖ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడాన్ని నిరసిస్తూ ఈ నెల 30 బుధవారం జన్నారం బంద్' కు పిలుపునిచ్చారు. ఈ బంద్ కార్యక్రమానికి జన్నారం పట్టణ ప్రజలు, వ్యాపారవేత్తలు, ఆటో యూనియన్ కార్మికులు, రైతు సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు మరియు యువకులు పెద్ద ఎత్తున తరలివచ్చి సంపూర్ణ సహకారం అందించాలని భూమాచారి కోరారు.

# సీసీసీ నస్పూర్ జాతీయ రహదారిపై ప్రమాద స్థలాన్ని పరిశీలించిన సీపీ అంబర్ కిషోర్ ఝా







**మంచిర్యాల, 28,సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సీసీసీ నస్పూర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద స్థలాన్ని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్, ఏసీపీ ఆర్. ప్రకాష్తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద స్థలంలోని రహదారి పరిస్థితులు, డివైడర్ తదితర అంశాలను పరిశీలించారు. సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదం అత్యంత బాధాకరమైన సంఘటన అని సీపీ అంబర్ కిషోర్ ఝా అన్నారు. ప్రాథమికంగా అందుబాటులో ఉన్న సీసీటీవీ దృశ్యాలను పరిశీలించిన మేరకు ఆటో రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తూ ఎదురుగా వచ్చిన టిప్పర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో ఇప్పటికే ముగ్గురు మృతి చెందడం అత్యంత విషాదకరమని, మృతుల్లో ఎక్కువగా మహిళలు ఉన్నట్లు ప్రాథమికంగా తెలుస్తోందన్నారు. వారు తమ పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం ఉందని తెలిపారు. ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించిన సందర్భంగా రహదారి మధ్యలోని డివైడర్‌లో ఉన్న ఖాళీ ద్వారా వాహనాలు అక్రమంగా మలుపు తిరిగే అవకాశం ఉన్నట్లు గుర్తించామని సీపీ తెలిపారు. ఈ ప్రాంతాన్ని ప్రమాదకర ప్రాంతంగా గుర్తించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు చేపడతామన్నారు. రహదారిపై అవసరమైన నిర్మాణాత్మక మార్పులు చేయడం, డివైడర్‌లోని ఖాళీని మూసివేయడం, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన చర్యలు చేపట్టడం వంటి అంశాలపై సంబంధిత శాఖలకు ప్రతిపాదనలు పంపించి, వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి అవసరమైన అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించేందుకు పోలీసు శాఖ సిద్ధంగా ఉందన్నారు. తీవ్రంగా గాయపడిన వారిలో కొంతమందిని ఇప్పటికే కరీంనగర్‌కు తరలించామని, మరికొందరు మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. క్షతగాత్రులను పరామర్శించి, వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందేలా అవసరమైన సహకారం అందిస్తున్నామని చెప్పారు. బాధితులకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా స్థానిక కలెక్టర్‌తో కూడా మాట్లాడి సమన్వయం చేస్తున్నట్లు సీపీ తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, అవసరమైన ఇంజినీరింగ్, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు.

# మాదకద్రవ్యాలకు నో చెప్పండి.. ఆరోగ్యకరమైన జీవితానికి పునాదులు వేయండి

**విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి**

**డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్**

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మాదకద్రవ్యాలకు, డ్రగ్స్‌కు నో చెప్పి ఆరోగ్యకరమైన జీవితానికి పునాదులు వేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ విద్యార్థులు, యువతకు పిలుపునిచ్చారు. నషాముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా ప్రభుత్వ బాలుర పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుధాకర్ నాయక్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అనిల్ కలిసి విద్యార్థులకు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్ మాట్లాడుతూ, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు జీవితాలను నాశనం చేస్తాయని అన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల శ్వాస సంబంధిత సమస్యలు, శరీరం బలహీనపడటం, వికారంగా ఉండటం, వాంతులు, గుండెపోటు, లైంగిక సమస్యలు, గుండె జబ్బులు, వాసన కోల్పోవడం, ఊపిరితిత్తుల సమస్యలు, కనుపాపలు పెద్దవిగా మారడం, ఆకలి లేకపోవడం, నోరు పొడిబారడం, చర్మం ఎర్రబడటం, తీవ్రమైన దురద, మలబద్ధకం, తలనొప్పి, మైకం, మగత, చెమటలు పట్టడం తదితర అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారిలో వ్యక్తిగత ప్రవర్తనలో హఠాత్తుగా మార్పులు రావడం, ప్రమాదకర నిర్ణయాలు తీసుకునే ధోరణి పెరగడం, కుటుంబపరమైన సమస్యలు, సంబంధాల్లో ఇబ్బందులు ఏర్పడటం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయని తెలిపారు. మత్తు పదార్థాలు సులభంగా అందుబాటులో ఉండటం వల్ల ముఖ్యంగా యువత వాటికి ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం గుట్కా, పొగాకు, ఖైనీ తదితర మత్తు పదార్థాలు అందుబాటులో ఉన్నాయని, వీటికి కూడా యువత దూరంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ సూచించారు. వీటి వినియోగం వల్ల క్యాన్సర్‌తో పాటు జీర్ణ సంబంధ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలంటే జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని, యోగా, ధ్యానం, మెడిటేషన్ వంటి వాటిని అలవర్చుకోవడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యకరమైన జీవనాన్ని కొనసాగించవచ్చని తెలిపారు. మత్తు పదార్థాలు లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ముఖ్యంగా విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలను ఉపయోగించకుండా ఉండటంతో పాటు ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా ప్రోత్సహించాలని కోరారు. ఆరోగ్యకరమైన, చైతన్యవంతమైన, బలమైన యువశక్తిని నిర్మించేందుకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాలు, వాటి వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులతో పాటు కళాశాల విద్యార్థులకు కూడా నషాముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ఇతరులను కూడా మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా ప్రోత్సహిస్తామని, మత్తు పదార్థాలు లేని భారతదేశ నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అవగాహన పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, అల్లాడి శ్రీనివాస్, సీహెచ్‌వోలు కాకిరాల వెంకటేశ్వర్లు, నాందేవ్ శ్రీనివాస్, ఆర్‌బీఎస్‌కే వైద్యులు, వైద్య సిబ్బంది, జిల్లా ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు బండి రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# ఆర్టీఐ సాధన కమిటీ పోస్టర్ ఆవిష్కరణ

## అక్టోబర్ 7న రవీంద్రభారతిలో ఆవిర్భావ దినోత్సవ అవగాహనా సదస్సు

## మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో సమాచార హక్కు చట్టం సాధన కమిటీ అవగాహనా కార్యక్రమం



**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు కల్పించిన హక్కులను ప్రతి ఒక్కరూ తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల అదనపు కలెక్టర్ వడాల రాములు సూచించారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మంచిర్యాల జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్టోబర్ 7న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్న సమాచార హక్కు చట్టం సాధన కమిటీ ఆవిర్భావ దినోత్సవ అవగాహనా సదస్సు పోస్టర్‌ను అదనపు కలెక్టర్ వడాల రాములు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు, ప్రజా నిధుల వినియోగం, పరిపాలనకు సంబంధించిన సమాచారాన్ని చట్టబద్ధంగా తెలుసుకునే హక్కు ప్రతి పౌరుడికి ఉందన్నారు. సమాచార హక్కు చట్టంపై క్షేత్రస్థాయిలో అవగాహన పెంచేందుకు నిర్వహించే సదస్సులు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడంలో ఆర్టీఐ చట్టం ప్రాధాన్యతను వివరించారు. జాతీయ చైర్మన్ డాక్టర్ చంటి ముదిరాజ్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు సూరస్రవంతి ఆదేశాల మేరకు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కమిటీ ప్రతినిధులు తెలిపారు. అక్టోబర్ 7న రవీంద్రభారతిలో జరిగే అవగాహనా సదస్సును విజయవంతం చేయాలని కోరారు. సదస్సులో సమాచార హక్కు చట్టం వినియోగ విధానం, ప్రజలకు అందుబాటులో ఉన్న హక్కులు, సమాచారాన్ని పొందే ప్రక్రియ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి తోట శ్రీనివాస్, జాతీయ సహాయ కార్యదర్శులు వంగల వివేకానంద, మార్క నవీన్, తెలంగాణ రాష్ట్ర కో-కన్వీనర్ గడప కృష్ణ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దూడం శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లపురాజు ప్రకాష్ పటేల్, మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పురెళ్ల శ్రీనివాస్, జిల్లా కో-కన్వీనర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, జిల్లా కోఆర్డినేటర్ పార్వతి అజయ్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ దూలం నాగలక్ష్మి, మందమర్రి మండల అధ్యక్షుడు అలిశెట్టి నరసయ్య పటేల్, తాండూర్ మండల అధ్యక్షుడు చింతల సంతోష్, తాండూర్ మండల డిప్యూటీ ప్రెసిడెంట్ తోగరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల్లో వివాదాలు సృష్టిస్తున్న సింగరేణి విజిలెన్స్ విభాగం పోకడలు

### ఏఐటీయూసీ నాయకులు




**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి విజిలెన్స్ విభాగం పోకడలతో కార్మికుల్లో వివాదాలు సృష్టిస్తున్నారని ఏఐటీయూసీ నాయకులు ఆరోపించారు . వారు సోమవారం మాట్లాడుతూ ,సింగరేణి సంస్థలో అవినీతిని నిర్మూలించడం, సంస్థకు జరుగుతున్న నష్టాన్ని నివారించడం, భవిష్యత్తులో జరగబోయే నష్టాలను ముందుగానే అంచనా వేసి అధికారులను అప్రమత్తం చేయడం, పరిపాలనా విధానాల్లోని లోపాలను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదికలు, సూచనలు ఇవ్వడం, సంస్థ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టడం, దొంగతనాలకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై విజిలెన్స్ విభాగం ప్రధానంగా దృష్టి సారించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. బొగ్గు ఉత్పత్తి, రవాణా, కొనుగోళ్లు, మెటీరియల్ సరఫరా తదితర విభాగాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తూ సంస్థకు నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాల్సిన విజిలెన్స్ విభాగం, కార్మికుల మధ్య వ్యక్తిగత విభేదాలకు సంబంధించిన చిన్నచిన్న ఫిర్యాదులపై ఎక్కువగా దృష్టి సారిస్తోందని ఆరోపించారు. కార్మికులు తోటి కార్మికులపై లేదా అధికారులపై ఫిర్యాదులు చేసినప్పుడు ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పినప్పటికీ, ఆ వివరాలు సంబంధిత అధికారులకు లేదా ఫిర్యాదు ఎదుర్కొంటున్న కార్మికులకు చేరుతున్నాయని పేర్కొన్నారు. దీంతో గనులు, డిపార్ట్మెంట్లలో కార్మికుల మధ్య విభేదాలు పెరిగి ఒకరిపై ఒకరికి శత్రుత్వ భావన ఏర్పడే పరిస్థితులు నెలకొంటున్నాయని తెలిపారు. సరైన చిరునామా, సమాచారం, వ్యక్తి పేరు తదితర వివరాలు లేని అనామక ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోకూడదనే నిర్దిష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, వాటిని కూడా విచారణకు స్వీకరించడం ద్వారా కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేకంగా శ్రీరాంపూర్ డివిజన్‌లోని గనులు, వివిధ డిపార్ట్మెంట్లపై వ్యక్తిగత కక్షలతో వచ్చిన ఫిర్యాదులపై అధికంగా దృష్టి సారించడం వల్ల సంస్థకు వాస్తవంగా జరుగుతున్న నష్టాన్ని గుర్తించి నివారించే విషయంలో విజిలెన్స్ విభాగం దృష్టి తగ్గుతోందని అన్నారు. ఇటీవల శ్రీరాంపూర్ డివిజన్‌లో సివిల్ డిపార్ట్మెంట్‌లో దొంగతనాలకు సంబంధించిన పేపర్ స్టేట్‌మెంట్లు, ఎస్అండ్‌పీసీ సిబ్బంది పట్టుకున్న ఘటనలు వెలుగులోకి వచ్చిన విషయాన్ని వారు ప్రస్తావించారు. ఇలాంటి ఘటనలు జరగకముందే నివారించేందుకు గతంలో జరిగిన సంఘటనలపై పర్యవేక్షణ, ముందస్తు చర్యలు చేపట్టాల్సిన విజిలెన్స్ విభాగం ఆ దిశగా మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. సంస్థలో దొంగతనాలు, మెటీరియల్ కొనుగోళ్లలో అవకతవకలు, మెటీరియల్ నాణ్యత, సంస్థ ఆస్తుల పరిరక్షణ తదితర అంశాలపై విజిలెన్స్ విభాగం సమర్థవంతంగా విచారణలు నిర్వహించాలని కోరారు. కార్మికుల వ్యక్తిగత వ్యవహారాలు, చిన్నచిన్న వివాదాలపై కాకుండా సంస్థ ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని సూచించారు. నిర్దిష్టమైన ఆరోపణలు, పూర్తి వివరాలతో వచ్చిన ఫిర్యాదులపై మాత్రమే చర్యలు తీసుకోవాలని, పేరు, చిరునామా, సరైన సమాచారం లేని అనామక ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకోకూడదని డిమాండ్ చేశారు. అలాగే యాజమాన్యం డిస్ట్రిబ్యూషన్ వ్యవహారాల్లో విజిలెన్స్ విభాగం అనవసర జోక్యం చేసుకోకుండా ఉండాలని ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా కోరుతున్నామని తెలిపారు. ఈ విషయాలపై సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి వాస్తవ పరిస్థితులను పరిశీలించి, విజిలెన్స్ విభాగం పనితీరును సమీక్షించి సంస్థ ప్రయోజనాలకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. విజిలెన్స్ విభాగం విధానంలో అవసరమైన మార్పులు తీసుకొచ్చి సంస్థ ఆస్తులను కాపాడటంతో పాటు కార్మికుల విశ్వాసాన్ని పొందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీలు కే. వీరభద్రయ్య, ముస్కే సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి షేక్ బాజీ సైదా, ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మోత్కూరి కొమరయ్య లు పాల్గొన్నారు

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

## జిల్లా కలెక్టర్ కె.హరిత





**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి** ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై వచ్చే దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ట్రైనీ కలెక్టర్ జోస్తిన్ జోల్ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లాలోని దహెగాం మండలం రనవెల్లి గ్రామానికి చెందిన కోలే స్వర్ణలత తన భర్త చనిపోయినందున అతని పేరిట ఉన్న భూమిని తన పిల్లల పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం జన్కపూర్ గ్రామానికి చెందిన కుమారస్వామి గ్రామంలో రోడ్ ఆక్రమణతో పాటు బతుకమ్మ గద్దెని కూల్చి స్థలం ఆక్రమించుకొని స్థలానికి పెంచన్ ఏర్పాటుచేసి ప్రధాన రహదారికి వెళ్లకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న విషయంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. జైనూర్ మండలం మాణిక్ గూడకు చెందిన జాదవ్ లలితభాయి తనకు ముగ్గురు పిల్లలు ఉన్నారని, నిరుపేద అయిన తనకు ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లింగాపూర్ మండలం పీర్లతండకు చెందిన పంచాయతీ సర్పంచ్ భానోత్ కృష్ణ, ఉపసర్పంచ్ బోడ సీత లు కలిసి వార్డు మెంబర్లను సమావేశనికి పిలవకుండా, ఆమోదం లేకుండా ప్రభుత్వం నుండి వచ్చే నిధులను దుర్వినియోగం చేస్తున్నారని, తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. చింతలమానపల్లి మండలం రుద్రపూర్ గ్రామానికి చెందిన కల్పన తన పేరు మీద ఉన్న భూమికి సంబంధించిన వివరాలను ఆన్లైన్ లో నమోదుచేసి పట్టా పాస్ పుస్తకం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఆసిఫాబాద్ మండలం చిలాటిగూడ గ్రామానికి చెందిన బొమ్మరే మహేష్ తాను దివ్యాంగుడిని అని, నిత్యవసరం కోసం బయటికి వెళ్లడానికి తనకు ఈ.వి. బైక్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. చోర్పల్లి గ్రామానికి చెందిన మిట్ట మల్లయ్య కలెక్టరేట్ ఎదుట పెట్రోల్ పోసుకోడానికి ప్రయత్నించగా, జిల్లా కలెక్టర్ స్పందించి మిట్ట మల్లయ్య తన కూతురు గోలెం సమత పేరిట ఉన్న భూమిని తన పేరిట మార్చాలని దరఖాస్తు చేసుకున్నారని, ఈ విషయం సివిల్ మేటర్ కావడంతో పాటు పిఓ ఐటిడిఎ ఏజెన్సీ కోర్టులో గోలెం సమత 2020లో కేసు నమోదు చేయడం వల్ల ఈ విషయాన్ని ఏజెన్సీ కోర్టులో తేల్చుకోవాలని నిర్దేశించారు. సదరు మిట్ట మల్లయ్య స్వయంగా తన కూతురు, కొడుకుల పేరిట 2024 జూన్ లో భూమిని పార్టిషన్ గా బదలాయింపు చేశారని, అక్టోబర్ 3వ తేదీన కేసు ఏజెన్సీ కోర్టులో విచారణకు ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# "ప్రజావాణి" దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి








## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీలతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి సోమవారం దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 49 దరఖాస్తులు అందాయి. జైపూర్ మండలం కిష్టాపూర్‌కు చెందిన సుందిళ్ల రాజయ్య తన పట్టా భూమి నిషేధిత జాబితాలో ఉందని, దానిని సవరించాలని కోరారు. కవ్వాల్ ఫిషర్మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు సంఘంలోని అనర్హులను తొలగించి అర్హులకు సభ్యత్వం కల్పించాలని కోరారు. కాసిపేట మండలం కోమటిచేను గ్రామానికి చెందిన జాడి అనసూర్య తన భర్త రోడ్డు ప్రమాదంలో మృతి చెందారని, జాతీయ కుటుంబ ప్రయోజన పథకం దరఖాస్తు కొమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాకు వెళ్లినందున దానిని మంచిర్యాల జిల్లాకు మార్చి పథకం ప్రయోజనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బెల్లంపల్లి పట్టణం అంబేద్కర్ నగర్‌కు చెందిన ఆలేటి భాగ్యలక్ష్మి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. కాజీపేట మండలం సోమగూడెం ట్యాంక్ బస్తీకి చెందిన భుఖ్య జ్యోతి కాజీపేట ఓపెన్ కాస్ట్‌లో భూమి కోల్పోయానని, ఎంజాయ్మెంట్ సర్వేలో తన పేరు ఉన్నప్పటికీ కొందరు తొలగించారని, సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామానికి చెందిన తౌట సువర్ణ రిజిస్టర్డ్ కొనుగోలు దస్తావేజు ద్వారా తాను కొనుగోలు చేసిన భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించుకున్నారని, న్యాయం చేయాలని కోరారు. మేదరిపేట గ్రామానికి చెందిన షేక్ తాజుద్దీన్ బస్టాండు సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తెగిపడటం, అగ్గిరవ్వలు రావడంతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. చెన్నూర్ మండలం కొమ్మెర గ్రామానికి చెందిన నోముల సుప్రజ ఎం.పి.హెచ్.డబ్ల్యూ పూర్తి చేశానని, చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆరోగ్య కార్యకర్తగా ఉపాధి అవకాశం కల్పించాలని కోరారు. మంచిర్యాల పట్టణం జాఫర్‌నగర్‌కు చెందిన నసీం బేగం తన ప్రాంతంలో పారిశుధ్యం, మురుగు కాలువల శుభ్రతపై చర్యలు తీసుకోవాలని కోరారు. నస్పూర్ మండలం శ్రీరాంపూర్‌కు చెందిన బొడ్డుపల్లి రజితకు ఇందిరమ్మ ఇల్లు మంజూరై చివరి విడత ఫొటో అప్‌లోడ్ చేసినందున బిల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగిన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పరిశీలించి, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జన్నారం విద్యార్థులపై జిల్లా అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?

**సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా టిఫిన్లు, మధ్యాహ్న భోజనం అందించాలి**
**ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్**
**జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం**

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా జిల్లాలోని ఇతర మండలాల విద్యార్థులకు టిఫిన్లు, మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్న విధంగానే జన్నారం మండలంలోని విద్యార్థులకు కూడా వెంటనే అందించాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా రామ్ ప్రసాద్ మాట్లాడుతూ జన్నారం మండల విద్యార్థుల పట్ల జిల్లా అధికారులు ఎందుకు వివక్ష చూపుతున్నారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జన్నారం మండలానికి భోజనం సరఫరా చేయాలని కోరినప్పుడు రవాణా దూరం ఎక్కువగా ఉందని, రవాణా ఖర్చులను ఎవరు భరిస్తారని అధికారులు పేర్కొనడం సరికాదన్నారు. మంచిర్యాల నుంచి చెన్నూరు మండలానికి, అలాగే పక్క జిల్లాలైన పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు సైతం సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా భోజనం సరఫరా చేస్తున్నప్పుడు, మంచిర్యాల జిల్లాలోని జన్నారం మండల విద్యార్థులకు రవాణా దూరాన్ని కారణంగా చూపడం సమంజసం కాదన్నారు. పేద,



మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని అధికారులు వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ఇతర మండలాలతో పాటు పక్క జిల్లాలకు ఎలాగైతే టిఫిన్లు, మధ్యాహ్న భోజనం పంపిణీ చేస్తున్నారో అదే విధంగా జన్నారం మండలంలోని విద్యార్థులకు కూడా త్వరలోనే సరఫరా ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే జన్నారం మండల విద్యార్థులతో కలిసి అన్ని సంఘాలను కలుపుకుని దశలవారీగా ఉద్యమాలు చేపడతామని నీరటి రామ్ ప్రసాద్ హెచ్చరించారు.

# గిన్నెదారిలో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం

**తిర్యాణి, సెప్టెంబర్ 28( ప్రజా జ్యోతి) :** మండలంలోని గిన్నెదారి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో 9వ పోషణ మాసం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చుంచు శ్రీనివాస్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చున్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో పోషకాహార లోపాన్ని నివారించడంలో అంగన్‌వాడీ కేంద్రాల సేవలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల్య ఆహారం ఎంతో అవసరమని, తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో



భాగంగా వివిధ రకాల పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించి, వాటి ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గిన్నెదారి సర్పంచ్ వెడ్మ సురేష్, గుడిపేట్ సర్పంచ్ మడవి తులసి, తలండి సర్పంచ్ నైతం మంగు, నాయకపుగూడా సర్పంచ్ ఏదుల సుమలత, డాక్టర్లు అక్షయ్, కౌటిల్య, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు, గ్రామ ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.

# ఉమంగ్ మేళాను ప్రారంభించిన సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు





**మంచిర్యాల, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వర్లు థియేటర్ సమీపంలోని ఖండేల్వాల్ భవన్‌లో మార్వాడి మహిళా మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉమంగ్ మేళా కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సురేఖ ప్రేమ్‌సాగర్ రావును శాలువాతో ఘనంగా సన్మానించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమంగ్ మేళాకు ఆమె హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గజ్జల హేమలత, మంచిర్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, 58వ డివిజన్ ఇన్‌చార్జి సరిత ఓజాతో పాటు పలువురు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ స్ఫూర్తితో యువజన ఉద్యమాలు

**యువత సమస్యలపై పోరాటాలకు సిద్ధం**
**ఇంక్విలాబ్ జిందాబాద్ స్ఫూర్తితో ఉద్యమాలు**



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి** భగత్‌సింగ్ స్ఫూర్తితో యువజన ఉద్యమాలను నిర్మిస్తామని డీవైఎఫ్ఐ రెబ్బెన మండల ప్రధాన కార్యదర్శి చాపిడి పురుషోత్తం అన్నారు. సోమవారం రాంపూర్ గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో భగత్‌సింగ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ.. భగత్‌సింగ్ చిన్ననాటి నుంచే దేశభక్తి భావాలతో పెరిగి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. యువతను చైతన్యపరిచి స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగం, విద్య, వైద్య రంగాల్లోని సమస్యలపై యువత ఐక్యంగా పోరాడాలని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్‌సింగ్ స్ఫూర్తితో ఉద్యమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు డోంగ్రే గజానంద్, ఉపాధ్యక్షుడు చునార్కర్ అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్

**తిర్యాణి జేజేసీలో 'నిషా ముక్త్ యువ--ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమం**



**తిర్యాణి, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి) :**మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తిర్యాణి ఎస్ఐ సుబ్బారావు, డాక్టర్ కౌటిల్య సూచించారు. తిర్యాణి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 'నిషా ముక్త్ యువ--ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే ప్రభావం, విద్యార్థుల భవిష్యత్‌పై కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సుబ్బారావు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు లోనుకాకుండా లక్ష్య సాధనపై దృష్టి సారించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత జీవితానికే కాకుండా కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. డాక్టర్ కౌటిల్య మాదకద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక సమస్యలను విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జి. అనిల్ కుమార్, అధ్యాపకులు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

**కనీస పెన్షన్ రూ.15 వేలకు పెంచాలి..**
**సీపీఆర్ఎంఎస్ వైద్య పరిమితి రూ.25 లక్షలకు పెంచాలి**
**సంఘం రిజిస్ట్రేషన్‌కు ఏకగ్రీవ ఆమోదం..**
**తాత్కాలిక అడ్‌హాక్ కమిటీ రద్దు**





**మంచిర్యాల, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):** మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల పట్టణంలోని హైటెక్ సిటీలో అడ్‌హాక్ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశంలో ఈ నెల 9న ఘనంగా నిర్వహించిన "ఆత్మీయ సమ్మేళనం" విజయవంతం కావడానికి సహకరించిన సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు నాయకులు కృతజ్ఞతలు, ధన్యవాదాములు తెలిపారు. ఈ సమ్మేళనం నిర్వహణకు సంబంధించిన రాబడి, ఖర్చులపై సమావేశంలో సమగ్రంగా సమీక్షించారు. మొత్తం 307 మంది సహకరించగా ఆదాయం 3 లక్షల 7 వేల రూపాయలు వచ్చింది. అలాగే దాత పెట్టం లక్ష్మన్ ఇచ్చిన 35 వేల తో కలిపి మొత్తం ఆదాయం 3 లక్షల 42 వేల ఆదాయం రావడం జరిగింది . "ఆత్మీయ సమ్మేళనం" కు 2 లక్షల 93 వేల 700 వ్యయం అయింది .48 వేల 300 మిగులు బడ్జెట్ గా తేలినట్లు ఈ సందర్భంగా వివరాలు తెలిపారు. ఇదిలా ఉండగా ఆత్మీయ సమ్మేళనం కోసం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన అడ్‌హాక్ కమిటీ కార్యక్రమం విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో దానిని ఏకగ్రీవంగా రద్దు చేస్తూ ఏక గ్రీవంగా తీర్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఇలాంటి మంచి కార్యక్రమాలు కొనసాగుతాయి కనుక అప్పటి సందర్భాన్ని మల్లి బట్టి తాత్కాలికంగా అడ్‌హాక్ కమిటీ ఏర్పాటు చేసి ఇవలాగే విజయవంతంగా కార్యక్రమం కొనసాగించడానికి ఆమోదం తెలిపారు. అనంతరం మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘాన్ని త్వరగా అధికారికంగా రిజిస్ట్రేషన్ చేయడానికి సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. రిజిస్ట్రేషన్ పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న కార్యవర్గాన్ని కొనసాగించాలని నిర్ణయించారు. ఇక సింగరేణి విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సింగరేణి యాజమాన్యానికి వినతిపత్రం సమర్పించాలని సమావేశంలో తీర్మానించారు. కనీస పెన్షన్‌ను రూ.15 వేలకు పెంచాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరడంతో పాటు ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఎంఎస్, హెచ్ఎంఎస్ జాతీయ కార్మిక సంఘాల నాయకులు ఈ అంశంపై కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలో ప్రారంభం కానున్న 12వ వేతన ఒప్పందం ముసాయిదాలో కోల్‌ఇండియా పరిధిలోని సింగరేణి సహా బొగ్గు పరిశ్రమ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను కూడా పొందుపరచాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులకు వైద్య సదుపాయాల కోసం ప్రస్తుతం సీపీఆర్ఎంఎస్ ద్వారా అందుతున్న రూ.8 లక్షల పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, సింగరేణి ఆసుపత్రుల్లో థైరాయిడ్, షుగర్ తదితర వ్యాధులకు చికిత్స పొందుతున్న విశ్రాంత ఉద్యోగుల నుంచి రుసుములు వసూలు చేయకుండా ఉచిత వైద్యం అందించాలని తీర్మానించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో విశ్రాంత ఉద్యోగుల సౌకర్యార్థం యోగా కేంద్రంతో పాటు సంఘ కార్యాలయం ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని, ప్రజాప్రతినిధులు ఆర్థికంగా సహకరించాలని కోరారు.

**సభ్యుల సంక్షేమానికి ప్రత్యేక నిధి ఏర్పాటు..**

సంఘం కార్యకలాపాలను కొనసాగించేందుకు సభ్యుల నుంచి ప్రతి ఆరు నెలలకు రూ.500 చొప్పున సభ్యత్వ రుసుముగా వసూలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సంఘంలో సభ్యత్వం పొందిన వారికే మాత్రమే సభ్యత్వ సౌకర్యాలు వర్తించేలా నిర్ణయించారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సభ్యులను ఆదుకోవడంతో పాటు అవసరమైన సందర్భాల్లో సభ్యులకు సహాయం అందించేందుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని తీర్మానించారు. సంఘం నిధులను ఎప్పటికప్పుడు పరిశీలించి సభ్యుల ముందు లెక్కలు ఉంచేందుకు కోశాధికారితో పాటు నలుగురు సభ్యులతో కమిటీని ఏర్పాటు చేయాలని తీర్మానించారు . సంఘ కార్యకలాపాల కోసం హైదరాబాద్, కొత్తగూడెం తదితర ప్రాంతాలకు వెళ్లి ప్రభుత్వ, సింగరేణి యాజమాన్యానికి వినతిపత్రాలు సమర్పించేందుకు అయ్యే ఖర్చులతో పాటు సంఘ నిర్వహణ వ్యయాలను సభ్యత్వ నిధి ద్వారా నిర్వహించాలని నిర్ణయించారు.

**సీనియర్ సిటిజన్లకు ఉచిత బస్సు, రైలు ప్రయాణ సౌకర్యం కల్పించాలి**

సింగరేణి విశ్రాంత ఉద్యోగులు కూడా సీనియర్ సిటిజన్లలో భాగమైనందున తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తూ బస్ పాసులు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్లకు ఉచిత రైలు పాస్ తో ప్రయాణ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఇల్లు లేని సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు ఇళ్లు లేదా ప్లాట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సంఘం బలోపేతం, సభ్యుల సంక్షేమం, విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ ముఖ్య సమావేశంలో జిల్లా అధ్యక్షులు గజెల్లి వెంకటయ్య, గౌరవ అధ్యక్షులు రాళ్లబండి రాజన్న, గౌరవ సలహాదారు పెట్టం లక్ష్మణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి నర్సయ్య, జిల్లా ఉపాధ్యక్షులు అలటయిన గంగన్నతో పాటు అడ్‌హాక్ కమిటీ నాయకులు మామిడిపల్లి అంజయ్య, పేరాల రాజమల్లు, పోతురాజుల చంద్రయ్య, దొంతుల సాయన్న, చిందం మల్లేష్, గోల్కొండ లక్ష్మీనారాయణ, బూర్ల జ్ఞాని, మేకల కృష్ణమూర్తి, ఎం.డి. ఖలీల్ పాషా, కుసుమ శంకర్, ఐ. రామయ్య, పి. రాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సంస్థ లాభాల ప్రకటనపై గోప్యత ఎందుకు?

**సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తుమ్మల రాజారెడ్డి**



**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ సెప్టెంబర్ నెల పూర్తవుతున్నా వాస్తవ లాభాలను ఎందుకు ప్రకటించడం లేదని సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ తుమ్మల రాజారెడ్డి ప్రశ్నించారు. కార్మికులకు సంస్థ వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐకే-1ఏ నూతన పిట్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో పెద్ద సంఖ్యలో యువ కార్మికులు సీఐటీయూ యూనియన్ వైపు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో సీఐటీయూ యూనియన్ గుర్తింపు సంఘంగా నిలవబోతుందని ధీమా వ్యక్తం చేశారు. సింగరేణి యాజమాన్యం లాభాల వాటాలకు సంబంధించిన లెక్కలు చేసుకున్నప్పటికీ సెప్టెంబర్ నెల పూర్తవుతున్నా వాస్తవ లాభాలను ప్రకటించడంలో ఎందుకు గోప్యత పాటిస్తోందని రాజారెడ్డి ప్రశ్నించారు. కార్మికులకు వెంటనే వాస్తవ లాభాలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు సంఘంగా ఉన్న ఏఐటీయూసీ నాయకులు రేపు, మాపు అంటూ కార్మికులకు మాటలు చెబుతూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఇటీవల చారిత్రక ఒప్పందాలు చేశామని చెబుతున్న ఏఐటీయూసీ నాయకులు వాటి అమలు ఎప్పటి నుంచి జరుగుతుందో స్పష్టంగా చెప్పడానికి ఎందుకు వెనకడుగు వేస్తున్నారని ప్రశ్నించారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్ మూడు సంఘాలు ఒకరినొకరు విమర్శించుకుంటున్నప్పటికీ, మరో సంఘం పైకి రాకుండా కుమ్మక్కై పనిచేస్తున్నాయనే అభిప్రాయం సీఐటీయూకు ఉందని, ఈ విషయాన్ని కార్మికులు కూడా గమనిస్తున్నారని రాజారెడ్డి అన్నారు. ఎన్నికలు జరిగే వరకు సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలను యాజమాన్యం సమానంగా చూడాలని కోరారు. కార్మికుల సొంతింటి కలను నెరవేర్చేందుకు 2026 సంవత్సరంలోనే సొంతింటి పథకానికి శంకుస్థాపన చేసి ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ సమావేశంలో బ్రాంచ్ నాయకులు రామగిరి రామస్వామి, గోదారి భాగ్యరాజు, సాయిల శ్రీనివాస్, మిడివెల్లి శ్రీనివాస్, వెంగళ శ్రీనివాస్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐకే-1ఏ మైన్‌లో సీఐటీయూ నూతన పిట్ కమిటీని ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా నరేడ్ల వెంకట్ రెడ్డి, కిషన్ రెడ్డి, బోడకుంట శంకర్, పిట్ సెక్రెటరీగా అఖిల్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీగా, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా బొజ్జ నవీన్‌ను నియమించారు. షిఫ్ట్ ఇన్‌చార్జులుగా పి. శ్రీనివాస్, ప్రశాంత్, అమర్‌లను, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా ఖదీర్, సుధీర్, తిరుపతి, కొమరయ్య, రవీందర్, శ్రీనాథ్, సాయికుమార్, గోలి సాయి, ప్రకాష్, చంద్రశేఖర్, పాశం శ్రీనివాస్, నాగరాజు, సాంబారి శంకర్‌లను నియమించినట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు.

# ఈసీ తీరుపై భగ్గుమన్న కాంగ్రెస్

**ఓటర్ల జాబితాలో పారదర్శకతపై ప్రశ్నలు అంబేద్కర్ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ**

**కేంద్ర ప్రభుత్వం, ఈసీ తీరును ప్రశ్నించిన ఆత్రం సుగుణక్క కలెక్టరేట్ ఎదుట దిష్టిబొమ్మల దహనం.. నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం**







**ఆసిఫాబాద్ సెప్టెంబరు 28 ప్రజా జ్యోతి** ఓటర్ల జాబితా సవరణ, ప్రత్యేక సమగ్ర పునఃపరిశీలన (ఎస్ఐఆర్) ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, ఓటు హక్కు విషయంలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ఎన్నికల సంఘం స్పష్టత ఇవ్వాలని డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా వ్యవహారంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాజకీయ ప్రయోజనం చేకూరేలా ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆమె ఆరోపించారు. ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న తీరుపై ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు.ఏఐసీసీ, టీపీసీసీ పిలుపు మేరకు సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా అంబేద్కర్ చౌరస్తా వద్ద డాక్టర్ బీఆర్ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన అనంతరం అక్కడి నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ప్రధాన రహదారులు కాంగ్రెస్ జెండాలు, నినాదాలతో సందడిగా మారాయి.కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన నిరసనలో ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, వివరాల సవరణ, డేటాబేస్ నిర్వహణ, సాఫ్ట్‌వేర్ తదితర అంశాలపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. ఎన్నికల సంఘం అంతర్గతంగా అభ్యంతరాలు వ్యక్తమైనట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో వాటిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో ప్రతి దశ పారదర్శకంగా ఉండాలని పేర్కొన్నారు.

**ఓటు హక్కుపై నమ్మకం ఉండాలి**

ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని సుగుణక్క అన్నారు. ఓటర్ల జాబితాలో మార్పులు, తొలగింపులకు సంబంధించి కారణాలు, ప్రక్రియపై ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సమాచారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ఒక్క ఓటరుకూ అన్యాయం జరగకూడదని అన్నారు. ఓటర్ల జాబితా అంశంపై కాంగ్రెస్ పార్టీ ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా, అభ్యంతరాలు మరియు దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం అధికారిక పోర్టల్‌లో ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణలకు సంబంధించిన విధానాలు, ఫారాలు అందుబాటులో ఉన్నాయి.

**దిష్టిబొమ్మల దహనం**

అనంతరం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి, ఎన్నికల సంఘం తీరుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్లతో ఏర్పాటు చేసిన దిష్టిబొమ్మలను దహనం చేసి తమ నిరసనను వ్యక్తం చేశారు. అనంతరం నాయకులు ఓటు హక్కు పరిరక్షణ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత కోసం పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విట్టల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కే. అనిల్‌కుమార్, మాజీ డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ జడ్పీ చైర్మన్ సిడాం గణపతి, టీపీసీసీ జనరల్ సెక్రటరీ దుర్గం భాస్కర్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు ఇరుకుల మంగ, కుడిమెత విశ్వనాథ్‌రావు, సుద్దాల దేవయ్య, ఆసిఫాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అబ్దుల్లా, డీఎంసీ వైస్ చైర్మన్ మంథయ్య, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ సుద్దాల శ్రీనివాస్, జిల్లా మైనారిటీ సెల్ చైర్మన్ అర్షద్ హుస్సేన్, మండల అధ్యక్షులు రాపర్తి మురళి, ఇమ్రాన్, రాసిద్, కిషన్‌గౌడ్, మెంగాజీ, ఆత్రం శంకర్, మున్సిపల్ కౌన్సిలర్లు, డీసీసీ కార్యవర్గ సభ్యులు, సర్పంచులు, యువజన కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల బాధ్యులు, మండల, పట్టణ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డిమాండ్‌కు అనుగుణంగా బొగ్గు ఉత్పత్తి, రవాణా జరగాలి

**నిర్దేశిత లక్ష్యానికి అదనంగా 10 శాతం ఉత్పత్తి, ఉత్పాదకత పెంచాలి**

**శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్**

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** దేశవ్యాప్తంగా బొగ్గుకు పెరిగిన డిమాండ్ నేపథ్యంలో ఉత్పత్తి, రవాణాపై సింగరేణి యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించింది. యాజమాన్యం సూచనల మేరకు శ్రీరాంపూర్ ఏరియాలోని భూగర్భ గనుల్లో నిర్దేశిత లక్ష్యానికి అదనంగా 10 శాతం ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు చర్యలు చేపట్టాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శ్రీరాంపూర్ ఏరియా కార్యాలయంలో గనుల వారీగా అధికారులతో సోమవారం జీఎం సమీక్షా సమావేశంను నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియాకు, వివిధ గనులకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్షించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనిప్రదేశాలు, కొత్తగా అభివృద్ధి చేయాల్సిన పనిప్రదేశాలు, వాటికి అవసరమైన అనుమతులు, డ్రిల్స్, ఎస్‌డీఎల్‌ల వినియోగం తదితర వివరాలను ఏజెంట్లు, మేనేజర్లను గనుల వారీగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం గనుల వారీగా ఉత్పత్తి లక్ష్యాల సాధనపై ప్రాజెక్టు అధికారులు, ఏజెంట్లు, మేనేజర్లు, ఇతర అధికారులకు జీఎం మునిగంటి శ్రీనివాస్ దిశానిర్దేశం చేశారు. దేశవ్యాప్తంగా బొగ్గుకు పెరిగిన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని నిర్దేశిత లక్ష్యంతో పాటు యాజమాన్యం సూచనల మేరకు భూగర్భ గనుల్లో 10 శాతం అధిక ఉత్పత్తి సాధించాలని ఆదేశించారు. సింగరేణిలోనే అత్యధిక సంఖ్యలో భూగర్భ గనులు శ్రీరాంపూర్ ఏరియాలో ఉన్నందున, నేటి నుంచే పక్కా ప్రణాళికతో నిర్దేశిత టార్గెట్‌కు అదనంగా 10 శాతం ఉత్పత్తి సాధించే దిశగా అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పనిచేయాలని జీఎం కోరారు. ఉత్పత్తితో పాటు రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏరియా ఇంజనీర్ సురేష్, ఐకే ఓసీ, ఐకే-1(ఏ) ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏ.వీ. రెడ్డి, ఆర్కే గ్రూప్ ఏజెంట్ ఎన్. శ్రీధర్, ఎస్ఆర్‌పీ ఏజెంట్ రవికుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (స్టోర్స్) మల్లయ్య, ఏరియా పర్చేజ్ ఆఫీసర్ చంద్రశేఖర్, క్వాలిటీ ఇన్‌చార్జ్ శ్రీధర్, అన్ని గనుల మేనేజర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా భగత్‌సింగ్ 119 వ జయంతి

**ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు ప్రజలు, యువత పోరాడాలి**
**ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పిదాలపై సమగ్ర విచారణ జరపాలి**
**దళిత హక్కుల పోరాట సమితి**

**మంచిర్యాల, సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి):**మంచిర్యాల జిల్లా కేంద్రంలో దళిత హక్కుల పోరాట సమితి (డి ఎచ్ పి ఎస్ ) ఆధ్వర్యంలో షహీద్ భగత్‌సింగ్ 119వ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించి, ఆయన ఆశయాలను కొనసాగించేందుకు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. 1907 సెప్టెంబర్ 28న జన్మించిన భగత్‌సింగ్ భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రముఖ విప్లవకారుడిగా నిలిచారు. ఈ సందర్భంగా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోచన్న మాట్లాడుతూ.. భగత్‌సింగ్ కోరుకున్న స్వాతంత్ర్యం కేవలం బ్రిటిష్ పాలన నుంచి అధికార బదిలీ మాత్రమే కాదని, దోపిడీ, అసమానతలకు ముగింపు పలికి సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య న్యాయంపై ఆధారపడిన సమాజాన్ని నిర్మించడమే ఆయన లక్ష్యమని అన్నారు. భగత్‌సింగ్ ఆశయాల సాధన కోసం యువత, విద్యార్థులు, ప్రజలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భగత్‌సింగ్ దేశ స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడారని, ప్రస్తుతం ప్రజాస్వామ్య హక్కుల్లో కీలకమైన ఓటు హక్కు విషయంలో ప్రజల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని దేవి పోచన్న అన్నారు. ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపుపై పూర్తి పారదర్శకత అవసరమని డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో సుమారు 13 కోట్ల పేర్లు ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి తొలగించబడ్డాయని పలు నివేదికలు పేర్కొన్న నేపథ్యంలో, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని వారు కోరారు. అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా అన్యాయంగా తొలగిపోకుండా ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. నోటీసుల ప్రక్రియ, ఓటర్లకు ఎదురవుతున్న ఇబ్బందులు, తొలగింపులకు సంబంధించిన పూర్తి వివరాలను ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం చర్యలపై అభ్యంతరాలు, విచారణ కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైన విషయాన్ని కూడా వారు ప్రస్తావించారు. ఆ పిటిషన్‌లో ఎస్ఐఆర్‌కు సంబంధించిన నిర్ణయాలపై విచారణ, సుమారు 13 కోట్ల ఓటర్ల పేర్ల తొలగింపుపై దర్యాప్తు కోరినట్లు వార్తా నివేదికలు వెల్లడించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో బాధ్యతారాహిత్యం లేదా చట్టవిరుద్ధ చర్యలు విచారణలో నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని దేవి పోచన్న డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై కూడా ఆయన తీవ్ర



ఆరోపణలు చేస్తూ, విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశవ్యాప్తంగా ప్రజలు, యువత, విద్యార్థులు ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ కోసం పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవి పోచన్న, మొగిలి లక్ష్మణ్, మాడిశెట్టి సత్యనారాయణ, ఎం.డి. రబ్బాని, పొనగంటి ఏసేపు, మాడిశెట్టి కుమార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల్లో ఓడిన ప్రతీసారీ రాజ్యాంగ సంస్థలపై కాంగ్రెస్ ఆరోపణలు

**ఈవీఎంల తర్వాత ఇప్పుడు ఎన్నికల సంఘంపై కొత్త డ్రామా**
**బీజేపీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్,**
**బీజేపీ తెలంగాణ మీడియా ప్యానలిస్టు తులా ఆంజనేయులు**

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ప్రజలు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించిన ప్రతీసారీ రాజ్యాంగ వ్యవస్థలపై ఆరోపణలు చేయడం ఆ పార్టీకి అలవాటుగా మారిందని బీజేపీ జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్, బీజేపీ తెలంగాణ మీడియా ప్యానలిస్టు తులా ఆంజనేయులు విమర్శించారు. మంచిర్యాల జిల్లా బీజేపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటివరకు ఈవీఎంలపై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ పార్టీ, ప్రజలు ఆ ఆరోపణలను నమ్మకపోవడంతో ఇప్పుడు ఎన్నికల సంఘాన్ని లక్ష్యంగా చేసుకుని కొత్త వివాదాన్ని తెరపైకి తెచ్చిందని వారు ఆరోపించారు. తెలంగాణ, కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్‌లలో కాంగ్రెస్‌కు అధికారం వచ్చినప్పుడు ఎన్నికల సంఘంపై ఇదే వైఖరి ఎందుకు లేదని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పుడు మాత్రమే ప్రజాస్వామ్య వ్యవస్థలపై అనుమానాలు వ్యక్తం చేయడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు . ఎన్నికల కమిషనర్ల మధ్య ఫైళ్లపై చర్చలు, అంతర్గత సూచనలు జరగడం సంస్థలో జరిగే పరిపాలనా ప్రక్రియలో భాగమేనని వారు అన్నారు. ముగ్గురు కమిషనర్లు ఎలాంటి చర్చలు లేకుండా సంతకాలు చేస్తే వారినే 'రబ్బర్ స్టాంపులు' అని విమర్శించేది కూడా కాంగ్రెస్ పార్టీయేనని అన్నారు. సెప్టెంబర్ 26న జరిగిన సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి కలిసి పలు అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారని, ఆ నిర్ణయాలు ఏకగ్రీవంగా తీసుకున్నట్లు ఎన్నికల సంఘం వెల్లడించిందని తెలిపారు. క్యాబినెట్ సెక్రటరీకి పంపిన లేఖ ఎన్నికల సంఘం విధానాలకు లేదా ఐటీ విభాగానికి సంబంధించినది కాదని, డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న అధికారి పనితీరుకు సంబంధించిన సర్వీస్ వ్యవహారమని, డీఈసీ పర్యవేక్షణ తొలగించలేదని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు.

**ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ ఆరోపణలు అవాస్తవం**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ ఓట్ల దొంగతనం కాదని, ఓటర్ల జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరిని చేర్చడంతో పాటు అనర్హులు, మరణించిన వారు, తరలిపోయిన వారి పేర్లను గుర్తించి జాబితా ప్రక్షాళన చేయడమే లక్ష్యమని బీజేపీ నేతలు అన్నారు. ఎన్నికల సంఘం కూడా ఎస్ఐఆర్ ఉద్దేశ్యం అర్హులైన ఓటర్లు ఎవరూ మిగలకుండా చూడటం, అనర్హుల పేర్లు తొలగించడం అని తెలిపిందని అన్నారు. బంగ్లాదేశీయులు, రోహింగ్యాలు, నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్ల అంశాలను ప్రస్తావిస్తూ, ఇలాంటి అనర్హతలను తొలగించే ప్రక్రియను కాంగ్రెస్ ఎందుకు వ్యతిరేకిస్తోందని వారు ప్రశ్నించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సంబంధిత నిబంధనల ఆధారంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్ఐఆర్ అంశంపై సుప్రీంకోర్టు విచారణలో కూడా ఎన్నికల సంఘం అధికారాలను, ప్రక్రియకు సంబంధించిన అంశాలను పరిశీలించిన విషయాన్ని వారు ప్రస్తావించారు. 2026 మే 27న వెలువడిన సుప్రీంకోర్టు తీర్పులో ఎస్ఐఆర్‌కు ఎన్నికల సంఘం పేర్కొన్న కారణాలను నమోదు చేసినట్లు కోర్టు తీర్పులో ఉంది. కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశాల్లో ఆరోపణలు చేయడం కాకుండా ఆధారాలు ఉంటే కోర్టు ముందు ప్రమాణపూర్వకంగా సమర్పించాలని వారు సవాల్ చేశారు. ఓటర్ల జాబితాలను మెషీన్-రీడబుల్ రూపంలో ఇవ్వాలన్న డిమాండ్ విషయంలోనూ కాంగ్రెస్ పదేపదే పాత వాదనలనే ప్రచారం చేస్తోందని విమర్శించారు.

**సామాన్య ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు**

ఎస్ఐఆర్ ప్రక్రియలో నోటీసులు అందుకున్న పేదలు, సామాన్యులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు) వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలు సేకరించే విధానాన్ని ఎన్నికల సంఘం ప్రకటించిందని వారు తెలిపారు. విచారణ అవసరమైన సందర్భాల్లో కూడా ప్రజలకు సౌకర్యవంతమైన విధానాలను కల్పించినట్లు తెలిపారు . నైట్ షెల్టర్లలో నివసించే నిరుపేదలు, కూలీలు, నిరాశ్రయులకు ఓటు హక్కు దూరం కాకుండా ప్రత్యేక శిబిరాలు, హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు



చేయాలని ఆదేశాలు ఇచ్చినట్లు వారు తెలిపారు. ఎన్ సి ఐ ఎన్ ఇ టి సాఫ్ట్‌వేర్‌పై అనుమానాలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో సాంకేతిక అంశాలను పరిశీలించేందుకు నిపుణులతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల సంఘం ప్రస్తుతం ఎన్ సి ఐ ఎన్ ఇ టి సహా సాంకేతిక ఆధారిత ఎన్నికల నిర్వహణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న విషయం అధికారికంగా అందుబాటులో ఉందన్నారు . ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు కొన్ని ప్రాంతాల్లో క్లెయిమ్‌ల గడువును పొడిగించడం, అర్హులైన ఓటర్లు ఎవరూ మిగిలిపోకుండా ప్రత్యేక నమోదు కార్యక్రమాలు కొనసాగించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు .

**కాంగ్రెస్ వైఖరిపై బీజేపీ నేతల విమర్శలు**

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శలను కూడా బీజేపీ నేతలు తప్పుబట్టారు. వివిధ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ వరుస ఎన్నికల్లో ఎదుర్కొన్న పరాజయాలను గుర్తుచేస్తూ, సొంత రాజకీయ వైఫల్యాలకు ఎన్నికల సంఘాన్ని, రాజ్యాంగ సంస్థలను బాధ్యులను చేయడం సరికాదని అన్నారు. ప్రధాని మోదీపై రాహుల్ గాంధీ చేసిన కొన్ని తీవ్ర వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, దేశ రాజ్యాంగ సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీసేలా మాట్లాడటం సరికాదని వారు అన్నారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల్లో అపోహలు సృష్టించవద్దని సూచించారు. ఈ సందర్భంగా ముఖేష్ గౌడ్, వెంకటేశ్వరరావు, కృష్ణ, ప్రేమ్‌సింగ్, రాజు, రాజేంద్రప్రసాద్, కమలాకర్‌రావు, జయరాంరావు శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలు, బ్లాక్ స్పాట్ల పరిశీలన





## ప్రమాదాల నియంత్రణకు రక్షణ చర్యలు, ఇంజనీరింగ్ పనులపై అధికారుల సమన్వయం

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** రోడ్డు ప్రమాదాల నివారణకు యాక్సిడెంట్ ప్రోన్ ఏరియాలు, బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన రక్షణ, భద్రతా చర్యలు చేపట్టేందుకు పోలీస్ శాఖ చర్యలు చేపడుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంచిర్యాల ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హన్నాన్ ఆధ్వర్యంలో రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం నుంచి మంచిర్యాల పట్టణ కేంద్రంలోని ఫ్లైఓవర్ వరకు ఉన్న ప్రమాదకర ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో తరచుగా ప్రమాదాలు జరిగే కారణాలను పరిశీలించి, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన రక్షణ, భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, అవసరమైన ఇంజనీరింగ్ పనులపై అధికారులు సమగ్రంగా చర్చించారు. మంచిర్యాల ఏఎంవీఐ సూర్యతేజ, మున్సిపాలిటీ ఏఈ, మంచిర్యాల దుర్గం మధు, లా అండ్ ఆర్డర్ ఎస్సైలు, ఇతర సంబంధిత అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొన్నారు. బ్లాక్ స్పాట్ల వద్ద రహదారి భద్రతకు అవసరమైన చర్యలను సంబంధిత శాఖల సమన్వయంతో చేపట్టాలని నిర్ణయించారు. ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియంత్రణ, రహదారి పరిస్థితుల మెరుగుదల, అవసరమైన ఇంజనీరింగ్ చర్యలు, ప్రజలకు అవగాహన కల్పించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్ స్పాట్లను గుర్తించడం, శాస్త్రీయమైన ఇంజనీరింగ్ చర్యలు చేపట్టడం, ట్రాఫిక్ భద్రతా చర్యలను అమలు చేయడంపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తోందని అధికారులు తెలిపారు. ప్రజలు కూడా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ అప్రమత్తంగా ప్రయాణించాలని సూచించారు.

# మంచిర్యాలలో యథావిధిగా పనిచేసిన బ్యాంకులు







## హమ్మయ్య అన్న ఖాతాదారులు
### చర్చలు ఫలించడంతో మూడు రోజుల సమ్మె వాయిదా..
### సోమవారం బ్యాంకింగ్ సేవలు సాధారణం

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** మూడు రోజుల బ్యాంకుల సమ్మె వాయిదా పడటంతో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని బ్యాంకులు సోమవారం యథావిధిగా పనిచేశాయి. దీంతో బ్యాంకు ఖాతాదారులు, వినియోగదారులు ఊపిరి పీల్చుకున్నారు. మూడు రోజుల పాటు బ్యాంకులు మూతపడనున్నాయన్న సమాచారంతో ముందుగానే నగదు లావాదేవీలు, ఇతర బ్యాంకింగ్ పనులు పూర్తి చేసుకోవాలని భావించిన వినియోగదారుల్లో కొంత ఆందోళన నెలకొంది. అయితే సమ్మె వాయిదా పడటంతో ఆందోళన తొలగిపోయింది. మంచిర్యాల పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐసీఐసీఐ బ్యాంక్, యూనియన్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్సీ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ తదితర బ్యాంకులు సోమవారం సాధారణంగా కార్యకలాపాలు నిర్వహించాయి. ఖాతాదారులకు నగదు ఉపసంహరణ, డిపాజిట్లు, చెక్కులు, ఇతర బ్యాంకింగ్ సేవలు అందుబాటులో ఉండటంతో వినియోగదారులు సంతోషం వ్యక్తం చేశారు.

**చర్చలు ఫలించడంతో సమ్మె వాయిదా**

బ్యాంకు ఉద్యోగ సంఘాలు చేపట్టనున్న మూడు రోజుల సమ్మె వాయిదా పడటానికి ఆదివారం రాత్రి జరిగిన కీలక చర్చలే కారణమయ్యాయి. ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ), యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా ముగిశాయి. దీంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు యూఎఫ్‌బీయూ ప్రకటించింది. కుదిరిన అవగాహన ప్రకారం ఐదు రోజుల పని విధానం అంశంపై రెండు పక్షాలకు చెందిన ప్రతినిధులతో అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఈ కమిటీ వివిధ వర్గాల అభిప్రాయాలను, ముఖ్యంగా బ్యాంకు వినియోగదారుల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుని నిర్ణయానికి రానుంది. అదేవిధంగా స్కేల్-4, ఆపై స్థాయి అధికారులకు సంబంధించిన పీఎల్ఐ (పర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్సెంటివ్) పథకంలో మార్పులు చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపే అంశంపై ఐబీఏతో చర్చలు జరగనున్నాయి. మిగిలిన సమస్యలపైనా సాధ్యమైనంత త్వరగా చర్చలు జరిపి పరిష్కారం కనుగొనేందుకు ఇరుపక్షాలు అంగీకరించాయి. దీంతో మూడు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలు నిలిచిపోతాయన్న భయాందోళనలకు తెరపడింది. సమ్మె వాయిదా పడటంతో సోమవారం బ్యాంకులు తెరుచుకుని సాధారణ సేవలు అందించడంతో "హమ్మయ్య" అంటూ ఖాతాదారులు ఊపిరి పీల్చుకున్నారు.

## రేకుల షెడ్డు నిర్మించాలని మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతి



**తిర్యాణి, సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి):** తిర్యాణి మండలం పంగిడి మాదర గ్రామపంచాయతీ పరిధిలోని పర్చికిగూడ గ్రామంలో రేకుల షెడ్డు నిర్మించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందజేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు తుంరం గోపాల్, స్థానిక సర్పంచ్ ఆత్రం రాధా, బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ సర్పంచ్ పర్చికి జంగు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను కలిసి గ్రామ అవసరాలను వివరించారు. గ్రామంలో రేకుల షెడ్డు నిర్మాణం జరిగితే ప్రజలకు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. సమస్యను పరిశీలించి షెడ్డు నిర్మాణానికి సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ పర్చికి హనుమంతరావు, రాయిసిడం లింగు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిందితులకు శిక్షలు పడేలా సమన్వయంతో పనిచేయాలి
### పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల మధ్య సమన్వయం అవసరం
### రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** నిందితులకు శిక్షలు పడేలా పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. బాధితులకు న్యాయం జరగాలంటే అసలైన నేరస్థులకు శిక్ష పడేలా సమర్థవంతమైన దర్యాప్తు, న్యాయపరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో మంచిర్యాల, పెద్దపల్లి జిల్లాల్లోని వివిధ కేసుల దర్యాప్తు, విచారణ, పెండింగ్ కేసులపై పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, పోలీసు అధికారులతో సీపీ సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కేసుల విచారణలో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కూడా అత్యంత కీలకమన్నారు. ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు వరకు ప్రతి దశలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కోర్టు విచారణ సమయంలో అవసరమైన సాక్ష్యాధారాలు, సాక్షులను సమర్థవంతంగా సమర్పించే అంశంపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో ఎక్కడైనా సమన్వయ లోపాలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గుడ్ ట్రయల్ మానిటరింగ్ సిస్టమ్ ద్వారా కేసుల విచారణను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిందితులకు శిక్షలు పడేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీ తెలిపారు. తద్వారా బాధితులకు సత్వర న్యాయం అందుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత సమర్థవంతమైన న్యాయవ్యవస్థ కోసం పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె. శ్రీనివాస్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంది రవీందర్, మంచిర్యాల అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) నహీదా ఫర్వీన్, మంథని ఏపీపీ అర్ధ కుమార్, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి

## ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో సౌకర్యాలపై నిరంతర పర్యవేక్షణ

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. సోమవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో విద్యా, సంక్షేమ శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, భోజనం, పారిశుద్ధ్యం, వంటశాలలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను కలెక్టర్లు, నియమిత అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేయాలని సూచించారు. విద్యార్థుల లెర్నింగ్ ఔట్‌కమ్స్ మెరుగుపడేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులు, పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించి, 2027 విద్యా సంవత్సరం నాటికి కనీసం 15 నుంచి 20 పాఠశాలలను పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. విద్యార్థులకు అందించే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన నేపథ్యంలో పెరిగిన సౌకర్యాలు వారికి సక్రమంగా అందేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు.పాఠశాలల్లో ప్రాథమిక వసతులు అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు పారిశుధ్య నిర్వహణ, వంటశాలల పరిశుభ్రత, నాణ్యమైన ఆహార సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆహార కలుషిత ఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎఫ్ఆర్ఎస్) ద్వారా హాజరు నమోదును సమర్థవంతంగా అమలు చేయాలని, ఉపాధ్యాయుల హాజరును క్రమం తప్పకుండా సమీక్షించి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యార్థుల హాజరును కూడా కలెక్టర్లు పర్యవేక్షించి హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని సూచించారు. షెడ్యూల్డ్ కులాలు, గిరిజన, వెనుకబడిన తరగతులు, అల్పసంఖ్యాక వర్గాలు, సాధారణ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించిన మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, భోజనం, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలను ఒకే సమగ్ర మానిటరింగ్ పోర్టల్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న కేంద్రీకృత వంటశాలల పనులను వేగవంతం చేసి నవంబర్ మధ్య నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల యూనిఫారాల తయారీ ప్రక్రియను వేగవంతం చేసి అక్టోబర్ 20 నాటికి ప్రస్తుత యూనిఫారాల తయారీ పూర్తి చేయాలని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన యూనిఫారాలను వచ్చే ఏడాది మే 30 నాటికి సిద్ధం చేసేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్‌లను సమీక్షించి విద్యార్థుల విద్యాభ్యాసానికి పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలని అన్నారు. యు-డైస్ డేటాలో సుమారు 70 నుంచి 80 వేల మంది విద్యార్థులు డ్రాప్ బాక్స్‌లో ఉన్న నేపథ్యంలో సంబంధిత వివరాలను పరిశీలించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని సూచించారు. సమగ్ర శిక్ష, ప్రధానమంత్రి శ్రీ కార్యక్రమాల కింద మంజూరైన నిధుల వినియోగాన్ని సమీక్షించి, నిర్దేశిత ప్రయోజనాలకు సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు తరచూ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, సరఫరా, విద్యార్థుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించాలని సంజయ్ జాజు సూచించారు. ప్రభుత్వ విద్య, సంక్షేమ కార్యక్రమాల ద్వారా జరుగుతున్న మంచి పనులను ప్రజలకు తెలియజేసేలా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని తెలిపారు.





**ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెంచుతాం**

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో విద్యావ్యవస్థను మరింత పటిష్ఠం చేసే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రజలకు వివరించి, విద్యార్థుల తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పిస్తూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలను అధికారుల సమన్వయంతో తరచూ ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ విలాయత్ అలీ, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రయాణికుల సౌకర్యార్థం ఆదిలాబాద్ రీజియన్ లో మరిన్నీబోర్డింగ్ పాయింట్లు

**రీజియన్ మేనేజర్ విజయ భాను**

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 28,(ప్రజా జ్యోతి)**ప్రయాణికుల సౌకర్యార్థం ఆదిలాబాద్ రీజియన్‌లో మరిన్ని బోర్డింగ్ పాయింట్‌లు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ మేనేజర్ డి.విజయ భాను తెలిపారు.ముందస్తు రిజర్వేషన్ చేసుకొనే ప్రయాణికుల కొరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 6 డిపోలలోని బస్సులు హైదరాబాద్, సికింద్రాబాద్‌కు వెళ్ళు వాటికి డిపోల వారిగా మరిన్ని బోర్డింగ్ పాయింట్లు (బస్సు ఎక్కే స్టేజిలు) ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.ఇప్పటి వరకు ఉదాహరణకు ఓ ప్ర యాణికుడు ముందస్తు రిజర్వేషన్ ఆదిలాబాద్ నుండి హైదరాబాద్‌కు చేసుకుంటే, ఆప్రయాణికుడు ఎక్కే స్థలం, కె పి బి గార్డెన్ దగ్గర కావాలంటే, డ్రైవర్ కి ఫోన్ చేసి ఎక్కేవారు. కాని ఇపు డు డ్రైవర్ టిమ్ మిషన్లోనే ఆ బోర్డింగ్ పాయింట్ డిస్ప్లేలో ఆప్షన్లు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సౌకర్యం వల్ల ప్రయా ణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వారి ఇంటి దగ్గర ఉన్న స్టేజి నుండే బస్సు ఎక్కే సౌకర్యం కలిగిస్తున్నామని అన్నారు.డిపోల వారిగా బోర్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఆదిలాబాద్ డిపో పరిధిలో రిమ్స్ హాస్పిటల్, కెపిబి గార్డెన్, మావల నుండి హైదరాబాద్ కు. హైదరాబాద్ నుండి బోయి నపల్లి, సుచిత్ర రోడ్, కొంపల్లి, మేడ్చల్, ఆదిలాబాద్‌కు అని ఆయన వివరించారు.నిర్మల్ నుండి హైదరాబాద్, మంచిర్యాల రోడ్ (చౌర స్తా),హైదరాబాద్ నుండి నిర్మల్ వరకు బోయిన్ పల్లి, సుచిత్ర) ఆ-రోడ్, కొంపల్లి, మేడ్చెల్, (హైదరాబాద్ నుండి భైంసా, బోయిన్ పల్లి, సుచిత్ర రోడ్, కొంపల్లి, మెద్చల్, మంచిర్యాల నుండి హైదరాబాద్, సిసిసీ – రోడ్, చెన్నూర రోడ్, ఆసిఫాబాద్ నుండి హైదరాబాద్, సోమ గూడెం హైదరాబాద్ నుండి ఆసిఫాబాద్) మంచిర్యాల/ ఉట్నూర్, తిరుమల గిరి రోడ్, ఆల్వాల్, హాకింపేట్, శామీర్ పేట్ వరకు బోర్డింగ్ పాయింట్‌లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగ పరుచుకొని ప్రయాణికులు మరింత సౌకర్యవంత ముగా, సురక్షితముగా, సుఖవంత ముగా ప్రయాణాలు చేయాలని కోరారు.



# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదు





**జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 28 ,( ప్రజాజ్యోతి ).**ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని జిల్లా ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను ఆయన స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, ఆయా శాఖల అధికారులు ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు సూచించారు. మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులకు సంబంధించి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజల సమస్యలను సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించేలా పనిచేయాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా, ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను ఆయనకు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ ధర్నాకు బయలుదేరిన కాంగ్రెస్ శ్రేణులు



**సోనాల, సెప్టెంబర్ 28 ( ప్రజాజ్యోతి ):**కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోనాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సోమవారం భారీ ధర్నా కార్యక్రమానికి ఆదిలాబాద్ బయలుదేరినాయి. ఎన్నికల నిర్వహణలో ఈసీ నిష్పాక్షికంగా వ్యవహరించడం లేదని, ప్రతిపక్షాల పట్ల వివక్ష చూపుతోందని కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను దెబ్బతీసే విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, అందుకు బాధ్యత వహిస్తూ జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవి నుంచి తప్పుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మండల కన్వీనర్ గాజుల పోతన్న, “ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికే ఈ పోరాటం చేస్తున్నాం. ఈసీ నిష్పాక్షికతను కోల్పోయే వరకు, బాధ్యుల రాజీనామా వరకు మా ఆందోళనలు ఆపేది లేదు” అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కసిరే పోతన్న, షేక్ మహమూద్, అమృత్ రావు పాటిల్, జాదవ్ రామచందర్, రమేష్, రాథోడ్ సంతోష్, గోరే బేగ్, హైమద్, శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# శాంతినగర్ లో భగత్ సింగ్ చౌక్ ఏర్పాటు త్వరలో విగ్రహాన్ని ఏర్పాటు



**ఖానాపూర్ సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి )**ఖానాపూర్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలోని గంజ్ రోడ్డు లో గల సప్త కూడలిలో భగత్ సింగ్ జయంతి పురస్కరించుకొని చైతన్య యూత్ ఆధ్వర్యంలో కూడలికి భగత్ సింగ్ చౌక్ గా సోమవారం నామకరణం చేశారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించి భగత్ దేశభక్తిని కొనియాడారు ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ మౌనిక మహేందర్ మాట్లాడారు.. శాంతినగర్ యువత కోరిక మేరకు ఈ యొక్క కూడలికి భగత్ సింగ్ చౌక్ నామకరణం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండిపెల్లి ప్రకాష్, కౌన్సిలర్లు బొప్పరపు సత్యవతి, గుమ్ముల అశోక్, వీడిసి అధ్యక్షులు బీసీ రాజన్న, నాగేందర్ రావు, అంకార్ శ్రీనివాస్, లండరి పరమేశ్, మల్యాల రాజేందర్, గోల్కొండ అబ్బాస్, కరిపే గంగారం, లాండేరి రమేష్, ఉపేందర్, రవీందర్, నారాయణ, కడుకుంట్ల శ్రీకాంత్, వేల్పుల రాజశేఖర్, సుర నవీన్, కడుకుంట్ల శ్రీనివాస్, జక్కుల అజయ్, జంగం మల్లికార్జున్ , గోల్కొండ వినీత్, కరిపే నరేందర్, అన్నపెన్న రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు. రమణ రోజుల్లో నీ చూపును మధునాతనంగా తీర్చిదిద్ది భగత్ సింగ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చైతన్య యూత్ సభ్యులు తెలిపారు

## కుమారుడి జ్ఞాపకార్థం.. సేవకు మరో అడుగు

**లుంబిని దీక్షా భూమిలో షెడ్ నిర్మాణానికి జాడి బాపూరావు ప్రతిపాదన**

**సెంటర్ కమిటీ ఏకగ్రీవ ఆమోదం**



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి** కుమారుడి జ్ఞాపకాన్ని చిరస్థాయిగా నిలిపేలా సేవా కార్యక్రమానికి జాడి బాపూరావు ముందుకొచ్చారు. జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షా భూమి ఆవరణలో 12ఐ18 అడుగుల స్థలంలో షెడ్ నిర్మించి సెంటర్ కమిటీకి అందజేసేందుకు ఆయన ప్రతిపాదన చేశారు. తన కుమారుడు జాడి అనంత్ కృష్ణ జ్ఞాపకార్థం ఈ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. షెడ్ నిర్మాణం అనంతరం దాని ద్వారా వచ్చే ఆదాయం పూర్తిగా డా.బీఆర్ అంబేద్కర్ సంఘం సెంటర్ కమిటీకి చెందేలా చేయనున్నట్లు బాపూరావు వెల్లడించారు. ఈ ప్రతిపాదనపై సెంటర్ కమిటీ సభ్యులు చర్చించి ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానం చేశారు. అనంతరం జాడి బాపూరావును శాలువాతో సత్కరించి, 69 గ్రామాల ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. లుంబిని దీక్షా భూమి అభివృద్ధికి, సమాజ సేవకు ఆయన అందిస్తున్న సహకారాన్ని సభ్యులు అభినందించారు.

## వాగు దాటితే.. ప్రాణాలకే ముప్పు!

**కొత్తగూడకు ప్రత్యామ్నాయ రహదారి కల్పించాలి**

**తహసీల్దార్‌కు గ్రామస్తుల వినతి**



**ఆసిఫాబాద్ సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి** వర్షాకాలంలో వాగు ఉద్ధృతితో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో కొత్తగూడకు ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం కేరమేరి తహసీల్దార్ నాగార్జునను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రానికి సుమారు 3 కిలోమీటర్ల దూరంలోని సాకడ గ్రామపంచాయతీ పరిధిలో కొత్తగూడ ఉంది. గ్రామానికి వెళ్లే మార్గంలో వాగు ఉండటంతో వర్షాలు కురిసినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయని గ్రామస్తులు తెలిపారు. నాలుగు రోజుల క్రితం వాగు దాటే ప్రయత్నంలో దుర్వ శ్రీనివాస్ ప్రవాహానికి కొట్టుకుపోయి మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 15 ఏళ్ల క్రితం ఆయన తండ్రి కూడా ఇదే వాగులో కొట్టుకుపోయినట్లు పేర్కొన్నారు. గతంలోనూ వాగు దాటే క్రమంలో పలువురు ప్రమాదాలకు గురయ్యారని, వర్షాకాలంలో వాగు దాటాలంటే భయంగా ఉందని తెలిపారు. గతంలో గ్రామానికి బీటీ రోడ్డు మంజూరైనా పనులు పూర్తికాకుండానే నిలిచిపోయాయని చెప్పారు. రామ్‌మందిర్ వెళ్లే మార్గంలో సెండే బిక్కు చేనులో నుంచి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో సర్పంచులు పెందోర్ ఆనందరావు, తుంరం లచ్చు, ఆదివాసీ నాయకుడు సెద్మకి తుకారాం, గ్రామస్తులు వినాయకరావు, పాండు, రమేష్, లచ్చు, సముద్రబాయి, రత్తుబాయి, సోము, గుణవంత్రావు తదితరులు పాల్గొన్నారు

# ఓట్ల చోరీకి అడ్డుకట్ట వేయాలి.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి...

**ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**

**నిర్మల్ జిల్లా డీసీసీ ఆధ్వర్యంలో నిరసన**

**ఖానాపూర్ సెప్టెంబర్ 28( ప్రజా జ్యోతి )** ఏఐసీసీ పిలుపు మేరకు, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా డీసీసీ ఆధ్వర్యంలో ఓటు హక్కు పరిరక్షణ, ఓట్ల చోరీని అడ్డుకోవాలని డిమాండ్ చేస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే, నిర్మల్ జిల్లా డీసీసీ అధ్యక్షులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ.. సర్ కార్యక్రమం పేరుతో తమకు అనుకూలంగా లేని ప్రాంతాల్లో ఓట్ల తొలగింపుకు బీజేపీ కుట్ర చేస్తోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తోంద న్నారు. సర్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించే పరిస్థితి ఏర్పడిందని కాంగ్రెస్ పార్టీ ఆందోళన వ్యక్తం చేస్తోందన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల కమిషన్ తీరుపై గతంలోనే పలుమార్లు ప్రశ్నలు లేవనెత్తినప్పటికీ, కమిషన్ పనితీరులో మార్పు కనిపించలేదని ఎమ్మెల్యే అన్నారు. ఓటర్ల జాబితాల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులపై ప్రజలకు ఎన్నికల కమిషన్ స్పష్టమైన సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వ్యవస్థపై వస్తున్న అభ్యంతరాలు కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే సంబంధించినవి కావని, దేశంలోని పలు ప్రతిపక్ష పార్టీలు కూడా ఎన్నికల కమిషన్ వ్యవహారశైలిపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరుకు ఓటు హక్కు కల్పించేలా ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సాగాలని కోరారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలని, ఓటర్ల



జాబితాలపై సమగ్ర విచారణ జరిపించాలని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రజాస్వామ్య వాదులు, ప్రజా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు కలిసి గళం విప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని జాయింట్ కలెక్టర్ ని కలిసి వినతిపత్రం అందజేశారు. జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని, ఓటర్ల జాబితాపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన ఓటర్ల హక్కులను కాపాడాలని వినతిపత్రంలో కోరారు. ఈ కార్యక్రమం లో నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జ్ కూచాడి శ్రీహరి రావు మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్అలీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు రాజుర సత్యం కార్యదర్శి అంకం రాజేందర్ దొనుకొని దయానంద్ జంగిలి శంకర్ గౌరె గంగాధర్ నిమ్మల రమేష్ ఖానాపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల అధ్యక్ష కార్యదర్శులు వివిధ వింగుల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# బ్రిడ్జిపై యువకుడి హల్‌చల్

**స్థానికులు, పోలీసుల చాకచక్యంతో రక్షణ**



**బాసర, సెప్టెంబర్ 25 ప్రజాజ్యోతి** బైక్ కొనివ్వాలని కుటుంబ సభ్యులతో గొడవపడి గోదావరి నదిలో దూకుతానంటూ బాసర గోదావరి నది బ్రిడ్జిపై హల్‌చల్ చేసిన యువకుడిని వాగ్దేవి లేబర్ కాంట్రాక్ట్ సిబ్బంది, బోటింగ్ సిబ్బంది, పోలీసులు చాకచక్యంగా అడ్డుకుని కాపాడారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్టేషన్ హౌస్ ఆఫీసర్ దీపక్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా నవీపేట మండలానికి చెందిన నవీన్ సోమవారం బాసర గోదావరి నది బ్రిడ్జిపైకి వచ్చి ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశాడు. దీనిని గమనించిన వాగ్దేవి సొసైటీ సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. కొద్దిసేపు యువకుడు బైక్ కొనిచ్చే హామీ ఇచ్చే వరకు బ్రిడ్జిపై నుంచి దిగనని మొండికేశాడు. దీంతో పోలీసులు, స్థానికులు నవీన్‌కు నచ్చజెప్పడంతో పాటు కుటుంబ సభ్యులను సంప్రదించారు. బైక్ కొనిస్తామని కుటుంబ సభ్యులు హామీ ఇవ్వడంతో అప్రమత్తంగా వ్యవహరించిన సిబ్బంది నవీన్‌ను బ్రిడ్జిపైకి లాగి రక్షించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ నిర్వహించిన పోలీసులు.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడిని కాపాడేందుకు అప్రమత్తంగా వ్యవహరించిన వాగ్దేవి లేబర్ కాంట్రాక్ట్ సిబ్బంది గణపతి, శ్రీనివాస్, బోటింగ్ సిబ్బంది గంగాధర్, నరేష్, సతీష్, పోలీసు సిబ్బందిని బాసర సీఐ దీపక్ అభినందించారు.

## వరి ధాన్యం కొనుగోలు సాఫీగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 28 ,( ప్రజాజ్యోతి ).** వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను సాఫీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్ లో నిర్మల్ జిల్లా కు సంబంధించి వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియపై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఖరీఫ్ (వానాకాలం) వరి ధాన్యం కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. సమయానికి ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభించాలన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా తగిన వసతులు కల్పించాలని పేర్కొన్నారు. కొనుగోలుకు సంబంధించిన సామగ్రి అంతా సమకూర్చుకోవాలన్నారు. రైతులకు ఎక్కడ కూడా ఇబ్బందులు కలుగకూడదన్నారు. శాఖల మధ్య సమన్వయంతో కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఆర్డీవో దేవీదాస్, పౌర సరఫరాల అధికారులు, రాజేందర్, సుధాకర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టు స్టే ఉన్న భూమికి రిజిస్ట్రేషనా? - సర్వే నం.64,65లో ఉన్న భూమిని పరిరక్షించాలని వినతి




**జన్నారం,సెప్టెంబర్28 (ప్రజాజ్యోతి)**జన్నారం మండలం మొర్రిగూడ గ్రామ సర్వే నంబర్ 64, 65 లలోని తమ పూర్వీకుల భూమిని కబ్జాదారుల నుంచి పరిరక్షించాలని మొర్రిగూడకు చెందిన గాజుల కోట మల్లయ్య, గాజుల లింగయ్య కుటుంబీకులు తరపున సోమవారం రోజున అడ్వకేట్ కొరివి శివశంకర్ జన్నారం మండల తహసిల్దార్ బక్కయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదరు భూమికి సంబంధించి హైకోర్టులో 23214 2008, ఔ్యా చీ.17839 శీట 2008 లో 2008 సెప్టెంబర్ 8న అప్పటి జస్టిస్ ఎన్.వి.రమణ స్టేటస్ కో ఉత్తర్వులు ఇచ్చారని తెలిపారు. కోర్టులో కేసు పెండింగ్ లో ఉండగానే ఎంఆర్ఓ ఇనాం పట్టా భూమిని రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని ఆరోపించారు. హైకోర్టు స్టే ఉండగా ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారని ప్రశ్నిస్తూ ఎంఆర్ఓ కలెక్టర్, ఆర్డీఓ లకు దరఖాస్తు ఇచ్చామని, వెంటనే ఆ రిజిస్ట్రేషన్ ను బ్లాక్ లో పెట్టాలని విజ్ఞప్తి చేశామని తెలిపారు. ఎంఆర్ఓ కలెక్టర్ కు నివేదిక పంపిస్తామని చెప్పగా, తప్పు చేసింది మీరే కనుక మీరే బ్లాక్ లో పెట్టాలని కోరినట్లు తెలిపారు. కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ ప్రత్యర్థులు భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, అధికారులు జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# ఎన్నికల సంఘం విశ్వసనీయతను కాపాడేందుకు ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి







**డిసిసి అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్**

**ఎస్ ఐ ఆర్ అవక తవకల పై కాంగ్రెస్ మహాధర్నా**

**జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుండి భారి ర్యాలీ**

**కలేక్టరేట్ వద్ద బైటాయింపు**

**ఈసి, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు**

**సి ఈ సి జ్ఞానేశ్వర్ కుమార్ దిష్టి బొమ్మ దహనానికి యత్నం**

**అడ్డుకున్న పోలీసులు**

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 28,(ప్రజా జ్యోతి)** భారత ఎన్నికల సంఘం పనితీరు, ఓటర్ల జాబితా సవ రణలో చోటుచేసుకుంటున్న పరిణామాలకు నిరసనగా ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వ ర్యంలో డీసీసీ అధ్యక్షులు డా. నరేష్ జాద వ్ నాయకత్వంలో సోమ వారం భారీ నిరసన ర్యాలీ, ధర్నా నిర్వహించారు.ర్యాలీ ప్రారంభమ య్యే ముందు ముఖ్య నాయకులతో కలిసి గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్ వద్ద మహాత్మా గాంధీ, డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయం నుంచి వందలాది మంది కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలతో డా. నరేష్ జాదవ్, మాజీ ఎంపీ సోయం బాబూరావు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీ నివాస్ రెడ్డి, బోథ్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆడే గజేందర్, మాజీ టీపీసీసీ జనరల్ సెక్రెటరీ గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ చైర్మన్ అల్లూరి సంజీవ రెడ్డి, ఆదిలా బాద్ మార్కెట్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డిలతో కలిసి వందల మంది కార్యకర్తలతో ర్యాలీగా జిల్లా కలెక్టర్ కార్యాలయం వైపు బయలుదేరారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయిం చి ధర్నా నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు “జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి”, “ఓట్ చోర్ గద్దే ఛోడ్”, మోదీ డ న్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీ తనం, ఓటర్ల హక్కుల పరిర క్షణకు ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇటీవల ఒక పత్రికలో ప్రచురించిన పరిశోధనాత్మక కథనం ప్రకారం, ఎన్ని కల కమిషనర్ సుఖర్ సింగ్ సంధు, డా. వివేక్ జోషి గత పదినెలల్లో కనీసం 14 సందర్భాల్లో ఎన్నికల సంఘం నిర్ణయా లు, ఆదేశాలపై అధికారికంగా అభ్యంతరాలు నమోదు చేసినట్లు నివేదిం చబడిందని డా. నరేష్ జాదవ్ పేర్కొన్నారు. ఈ అభ్యంత రాలు ఓటర్ల నమోదు, పేర్లతొలగింపు--పునరుద్ధరణ, ఫామ్ ఓ ఆర్ఎం -6 మార్పులు, ఓటర్ల డేటాబేస్ నిర్వాహణ వంటి కీలక అంశాలకు సంబం ధించినవిగా నివేదించబడ్డా యని తెలిపారు. అదే సమయంలో, ఎన్నికల సంఘం మాత్రం సర్ సహాతుది నిర్ణ యాలన్నీ కమిషన్ సభ్యుల ఆమోదంతో, ఏకగ్రీవంగా తీసుకున్నవేనని స్పష్టం చేసిందని డా. నరేష్ జాదవ్ తెలిపారు. ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు పలుసందర్భాల్లో అభ్యంతరాలు నమోదు చేసినట్లు నివేదికలు వెలువడటం ప్రజల్లో సహజంగానే అనుమానాలు, ఆందో ళనలకు దారితీ స్తోంది అని ఈ పరిణామాల పై ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో ప్రజలకు వివరణ ఇవ్వాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం పై ఉంది” అని డా. నరేష్ జాదవ్ అన్నారు. ప్రస్తుతం కొనసాగుతు న్నసర్ ప్రక్రియలో 30 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముసాయిదా ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించబడినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన ఒక్క ఓటరు కూడా తనకు తెలియకుండా ఓటర్ల జాబితా నుంచి తొలగించబడకూ డదని, ప్రతి ఓటరుకు తగిన నోటీసు, తనవాదన వినిపిం చే అవకాశం, సవరణ, అప్పీల్‌కు సమర్థవంతమైన విధానం ఉండాలని,ఓటు హక్కు ప్రజా స్వామ్యానికి పునాది” అని ఆయన అన్నారు.

**జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి**

ఎన్నికల సంఘం విశ్వసనీయత, సంస్థాగత స్వతంత్రత, ప్రజల విశ్వాసాన్ని కాపాడేందుకు ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని డా.నరేష్ జాదవ్ డిమాండ్ చేశారు.ఎన్నికల కమిషనర్ల మధ్య నమోదైన ట్లు నివేదించ బడిన అభ్యం తరాలు, సంబంధిత ఫైళ్లు, అంతర్గత నోట్లు, సమావే శాల మినిట్స్‌ను చట్టపరమైన పరిమితులకులోబడి పారదర్శకంగా వెల్లడించాలని, సర్‌ప్రక్రియలో ఓటర్ల పేర్ల తొలగింపు--పునరుద్ధరణ విధానంపై స్వతంత్ర సమీక్ష నిర్వహించాలని కోరారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా అనంతరం కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల సంఘా నికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తు ముఖ్య ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మ దహనం చేసేందుకు కార్యకర్తలు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు.ఈ క్రమంలో పోలీసులు, కాంగ్రెస్ కార్యక ర్తల మధ్య కొంతసేపు తోపు లాట చోటుచేసుకుంది. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్‌కి వినతి పత్రం సమర్పించడం జరిగింది ఓటర్ల హక్కుల పరిరక్షణ, సర్ ప్రక్రియలో పారదర్శకత, ఎన్నికల సంఘం జవాబుదారీతనం వం టి అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, బోథ్ మార్కెట్ చైర్మన్ మల్లెపూల సత్యనారాయణ, జైనథ్ మార్కెట్ చైర్మన్ అశోక్ రెడ్డి, ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమరం సత్యవతి కోటే ష్, బోథ్ ఆత్మ కమిటీ చైర్మన్ రాజు యాదవ్, ఆదిలాబాద్ ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు ఆసిఫ్ ఖాన్, పట్టణ కాంగ్రెస్ అధ్య క్షులు ఖిజర్ పాషా, ఎస్సీ విభాగం చైర్మన్ పరమేశ్వర్, ఎస్టీ విభాగము రాష్ట్ర ఉపా ధ్యక్షులు సేద్మకి ఆనంద్ రా వు, జిల్లా కాంగ్రెస్ మహిళా విభాగం అధ్యక్షురాలు అన్న పూర్ణ, ఎన్ ఎస్ యుఐ అధ్యక్షులు కపిల్, సేవాదల్ జిల్లా అధ్యక్షులు మోతిరామ్, మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షు లు షాహిద్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బూరుగుల మల్లేష్,యూత్ కాంగ్రెస్ ఆది లాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు నాహిద్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షులు రూపే ష్ రెడ్డి, బోథ్ అసెంబ్లీ యూ త్ కాంగ్రెస్ అధ్యక్షులు పో తా రెడ్డి, ఉపాధ్యక్షులు అనీష్ గుడాల,అధ్యక్షులు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్య క్షులు, జిల్లా జనరల్ సెక్రెటరీలు సెక్రటరీలు, మండల కాంగ్రెస్ అధ్య క్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, టౌన్ కాంగ్రెస్ నాయకులు, వివిధ విభాగాల ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ ఆశయాలతో యువత పోరాడాలి

**హక్కుల సాధనకు యువత నడుం బిగించాలి**

**కుల, మత వివక్ష లేని సమాజం కోసం ఉద్యమించాలి**

**ఆసిఫాబాద్‌సెప్టెంబర్ 28 ప్రజా జ్యోతి** షహీద్ భగత్‌సింగ్ ఆశయా లతో యువత ముందుకు సాగాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దుర్గం రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని డీవైఎఫ్ఐ కార్యాల యంలో భగత్‌సింగ్ 119వ జయంతి వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. భగత్‌సింగ్ బ్రిటిష్ పాలన నుంచి దేశానికి విముక్తితో పాటు కుల, మత, మహిళా వివక్ష లేని సమాజాన్ని కోరుకున్నారని తెలిపారు. ఆయన ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. భగత్‌సింగ్ రచించిన ‘నేనెందుకు నాస్తికుడినయ్యాను’ పుస్తకాన్ని చదివి ఆయన ఆలోచనలను తెలుసుకోవాలని కోరారు. యువత కుల, మతాలకు అతీతంగా ఐక్యంగా నిలిచి హక్కుల సాధన, ఉపాధి--ఉద్యోగాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారత, దేశ అభివృద్ధి కోసం నడుం బిగించాలని అన్నారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో డీవైఎఫ్ఐ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందని తెలిపారు.కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకానంద్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, టీఏజీఎస్ జిల్లా కార్యదర్శి నేర్పెల్లి అశోక్, జిల్లా




ఉపాధ్యక్షుడు కోట శ్రీనివాస్, నాయకులు మురళి, చిన్ను, విజయ్ తదితరులు పాల్గొన్నారు

# ఓటు చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ భారీ నిరసన

**మంచిర్యాల కలెక్టరేట్ ఎదురుగా ఆందోళన..**
**సీఈసీ దిష్టిబొమ్మ దహనం**



**మంచిర్యాల, 28,సెప్టెంబర్ (ప్రజా జ్యోతి):** ఏఐసీసీ, టీపీసీసీ ఇచ్చిన పిలుపు మేరకు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం మంచిర్యాల కలెక్టరేట్ ఎదురుగా భారీ నిరసన కార్యక్రమంను నిర్వహించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఏకపక్ష ధోరణికి నిరసనగా, ఎస్ఐఆర్ ప్రక్రియలో అక్రమాలు, అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ పేర్కొంటూ జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆందోళన చేపట్టారు.ఈ కార్యక్రమానికి మంచిర్యాల సిటీ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుమ్మల నరేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని, ఓటర్ల హక్కులను పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ లేవనెత్తుతున్న అంశాలపై పారదర్శకంగా పరిశీలన జరిపి, ఓటర్ల హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పక్షపాత విధానం ఉండాల్సిన అవసరం ఉందన్నారు.అనంతరం కాంగ్రెస్ నాయకులు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్‌ను కలిసి కాంగ్రెస్ పార్టీ తరఫున వినతిపత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల సిటీ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు, మంచిర్యాల జిల్లా మార్కెట్ కమిటీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు, జిల్లా పదాధికారులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, ఎస్సీ సెల్, బీసీ సెల్, డాక్టర్ సెల్, మైనారిటీ సెల్ నాయకులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ప్రజాస్వామ్య విలువలు, ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# రిమ్స్‌లో వైద్య సేవల పురోగతిపై కలెక్టర్ ఆకస్మికతనిఖీ

**రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సమన్వయంతో చర్యలు చేపట్టాలి జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 28,(ప్రజా జ్యోతి)** అదిలాబాద్ రిమ్స్‌లో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా సమన్వయం తో చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిరిమ్స్ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవ లు అందించడమే లక్ష్యంగా చేపడుతున్న చర్యలను జిల్లా కలెక్టర్ రాజర్షి షా సోమ వారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి లోని వివిధ వార్డులతో పాటు పరిసర ప్రాంతాల్లో కొన సాగుతున్న పారిశుధ్య కార్య క్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎంబీఎన్ఐసీయూ, గైనకాలజీ వార్డులను కలెక్టర్ పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అందు తున్న వైద్య సేవలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రసవానంతరం బాలింతలు, నవ జాత శిశువులను సురక్షితంగా ఇతర వార్డులకు తరలించే ప్రక్రియ పై వైద్యులతో చర్చించారు. వైద్యులు, సిబ్బంది ప్రస్తావించిన చిన్నపాటి సమస్యలను వెంటనే పరి ష్కరించాలని, ఒకటి రెండు రోజుల్లో అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రిమ్స్ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ. 13 కోట్ల నిధులకు సంబంధించి న టెండర్ ప్రక్రియ పూర్తయిందని కలెక్టర్ తెలి పారు. అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచించారు. ఇందుకోసం మున్సిపల్, పంచాయతీ రాజ్, టీజీ ఎం ఎస్ ఐడీసీ, ఆర్అండ్‌బీ తదితర ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఆసుపత్రి లో రోగుల రద్దీ ఎక్కువగా ఉండే సమయాలను దృష్టిలో ఉంచుకుని టాయిలెట్ల మరమ్మతులు, పెయింటింగ్, ఆక్సిజన్ పైప్‌లైన్ ఏర్పాటు, ఇతర మరమ్మతు పనులను సమన్వయంతో చేపట్టాలని సూచించారు. ఒకే సారి వివిధ పనులు కొన సాగుతున్నప్పుడు రోగులు, వారి సహాయకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ప్రణాళికతో పనులు నిర్వహించాలని ఆదేశించారు. రిమ్స్ ఆసుపత్రి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రి ప్రధాన ద్వారం వద్ద తాగునీటి సౌకర్యం, స్కానింగ్ పరికరాలు, చెత్త బుట్టలు, షూర్యాక్‌లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రి నిర్వహణ సంస్థలు, సిబ్బంది, రోగులు,వారి సహాయకులు ఆసుపత్రి నిబంధనలను తప్పనిసరిగా పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. రిమ్స్‌లో రోగుల రద్దీ అధికంగా ఉండే గైనకాలజీ, పీడియాట్రిక్ వార్డులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఇటీవల కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంపికైన వైద్యుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని, అవసరమైన వార్డుల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేయాల ని సూచించారు. రిమ్స్‌లో వైద్య సేవల నాణ్యతను మరింత మెరు గుపరిచేందుకు నిరంతర తనిఖీలు, సమీక్షలు కొనసా గుతాయని కలెక్టర్ తెలిపారు. మౌలిక వసతుల అభి వృద్ధితో పాటు పారిశుధ్యం, వైద్య సిబ్బంది అందుబాటు, రోగులకు అవసరమైన సౌకర్యాలకు సమాన ప్రాధాన్యత ఇస్తూ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో రిమ్స్ డైరె క్టర్ జై సింగ్ రాథోడ్, ఆర్డీఓ జగదీశ్వర్ రావు, మున్సిప ల్ కమిషనర్ జగదీష్ గౌడ్, రిమ్స్, మున్సిపల్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బ్లాక్ లిస్ట్ లో ఉన్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను రద్దు చేయాలి

**రిమ్స్ ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీలపై కలెక్టర్‌కు ఫిర్యాదు**



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 28,(ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ రిమ్స్‌లో బ్లాక్ లిస్టులో ఉన్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలను తక్షణమే రద్దు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్ర మంలో రిమ్స్‌లో కొనసాగు తున్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల వ్యవహారంపై పలువురు ఏజెన్సీల నిర్వాహకులు జిల్లా కలెక్టర్ రాజర్షి షాకు వినతిపత్రం అందజేశారు. రిమ్స్‌లో ప్రస్తు తం కొనసాగుతున్న కొన్ని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల్లో బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఏజెన్సీలు కూడా ఉన్నాయని వారు ఆరోపించారు. అంతే కాకుండా, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల కాలపరిమితిని పొడి గించే అధికారం లేని జిల్లా స్థాయి అధికారి కొన్ని ఏజె న్సీలను కొనసాగించేందుకు అనుమతి ఇచ్చారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఏజెన్సీల ను వెంటనే రద్దు చేసి, అర్హ త కలిగిన అన్ని ఔట్‌సోర్సిం గ్ ఏజెన్సీలకు సమాన అవకాశం కల్పించాలని కోరారు. జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆ ధ్వర్యంలో నిబంధనల ప్రకారం కొత్తగా నోటిఫికేషన్ జారీ చేసి, అర్హత ఉన్న ఏజెన్సీల నుంచి దరఖాస్తులు స్వీకరించే అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఏ జెన్సీలపై చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్‌ను కోరారు.ఈ కార్యక్రమంలో కొల్లూ రి స్వామి, గెడం శ్యామ్ సుందర్, అర్క దేవరావు, దత్తు, సిడామ్ శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి రూ. 5 లక్షల చెక్కు అందజేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 28, (ప్రజా జ్యోతి)**ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఘటనలో మృతి చెందిన ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన చిన్నారి కుటుంబం షేక్ సలీం సబలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్కును సోమవారం రిమ్స్‌లో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు. ధైర్యంగా ఉండాలని అండ గా ఉంటామని భరోసా క ల్పించారు. ఈ కార్యక్రమం లో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఇచ్చోడ మాజీ ఎం పీపీ ప్రీతం రెడ్డి, నెరడిగొండ మాజీ ఎంపీపీ రాథోడ్ సజ న్, మాజీ జడ్పీటీసీ జహీర్, సర్పంచ్ రవీందర్ రెడ్డి, మా జీ ఉప సర్పంచ్ దేవేందర్ రెడ్డి, రాథోడ్ సురేందర్, యు నుస్ అక్బాని తదితరులు ఉన్నారు.

# ప్రజా ఫిర్యాదులను త్వరిత గతిన పరిష్కరించాలి





**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 28,(ప్రజా జ్యోతి)** ప్రభుత్వ సంక్షే మ కార్యక్రమాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజావాణి పోర్టల్‌లో నమోదయ్యే ప్రతి ఫిర్యాదును నిర్దిష్ట గడువు లోగా పరిష్కరించడం సంబంధిత అధికారుల ప్రాథమిక బాధ్యత అని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్ర మంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను కలెక్టర్ స్వ యంగా స్వీకరించారు. ఇందిరమ్మ ఇళ్లు, పెన్షన్లు, ఉపాధి హామీ పథకం, భూభారతి సమస్యలు తదితర అంశాలకు సంబంధించి కలెక్టర్ కార్యాలయ స్థాయిలో 55,మండల స్థాయిలో 58 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వీటిపై తక్షణ చర్యలు చేప ట్టి, సంబంధిత శాఖల అధి కారులు సమన్వయంతో స మస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదును 30 రోజుల్లోపు పరి ష్కరించాలని సూచించారు. మండల స్థాయిలో ఎంపీడీ వోలు, తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు క్షే త్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యలను నిర్ణీత సమయంలో ప్రజావాణి పో ర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఒకే సమస్య పై పదేపదే ఫిర్యాదులు రాకుండా శాశ్వత పరిష్కారాలపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఆర్.ఎస్. చిత్రు, డీఆర్వో స్రవంతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొ న్నారు.

# పద్మావతి నగర్ పద్మశాలి సంఘానికి బీరువా విరాళం

**అందజేసిన ఉపాధ్యాయుడు అంజయ్య**

**ఖానాపూర్ సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి )**తిమ్మాపూర్ (ఖానాపూర్) పద్మావతి నగర్ పంథా పద్మశాలి సంఘం కార్యాలయ రికార్డులను భద్రపరిచేందుకు దాదాపు 4 వేల విలువ చేసే నూతన ఇనుప బీరువాను వెన్నం అంజయ్య ఉపాధ్యాయులుతమ తండ్రి చిన్నభీమయ్య జ్ఞాపకార్థం సోమవారం విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు నడిమెట్ల రమేష్ మాట్లాడుతూ, సంఘానికి సంబంధించిన ముఖ్యమైన రికార్డులు, దస్త్రాలు భద్రపరచడానికి ఈ బీరువా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంటూ దాత వెన్నం అంజయ్య కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తిమ్మాపూర్ సదరు సంఘము అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి ఎనగందుల రమణ, సభ్యులు రామ్ చిన్న భీమన్న, బండారి భీమన్న హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంథా అధ్యక్షులు నడిమెట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు,



ఉపాధ్యక్షులు కుందారపు రాజేష్, ప్రచార కార్యదర్శి నడిమెట్ల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ ఉద్యోగాల శిక్షణార్థులకు అన్నదాన సేవ అభినందనీయం

**అభ్యర్థులకు స్వయంగా వడ్డించి, వారితో కలిసి భోజనం చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా**

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 28,(ప్రజా జ్యోతి)** బీసీ, ఎస్సీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో స్థానిక బీసీ స్ట డీ సర్కిల్‌లో కానిస్టేబుల్, సబ్‌ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఉ ద్యోగాల కోసం ఎంపికైన 20 0 మంది అభ్యర్థులకు 60 రోజుల ఉచిత శిక్షణా కార్య క్రమం కొనసాగ ుతోంది. శిక్షణ పొందుతున్న అభ్యర్థుల సౌ కర్యార్థం ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో రెండు నెలల పాటు ఉచిత అన్నప్రసాద సేవ కార్యక్రమా న్ని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణ పొందుతున్న అ భ్యర్థులకు ఉచితంగా పోష కాహారంతో కూడిన అన్నప్ర సాదాన్ని అందిస్తున్న ఇస్కాన్ నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. పోటీ పరీక్షల కు సిద్ధమవుతున్న అభ్యర్థులు కష్టపడి చదివి, అందుబాటులో ఉన్న శిక్షణ, వసతులను సద్వినియోగం చేసుకుని ఉద్యోగాలు సాధించాల ని ఆకాంక్షించారు. అనంతరం కలెక్టర్ స్వయంగా అభ్యర్థులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా



అభ్యర్థుల శిక్షణ, పరీక్షల స న్నద్ధత, ప్రిపరేషన్ విధానం పై వివరాలు అడిగి తెలుసు కున్నారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి ప్రణవ నంద ప్రభుజీ, బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియా, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్, శిక్షణార్థులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ను కలిసిన తురాటి మున్నూరు కాపు సంఘం నాయకులు



**బాసర సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి)** నర్సాపూర్ మండలంలోని తురాటి గ్రామ మున్నూరు కాపు సంఘం నాయకులు, ఎమ్మెల్యే రామరావ్ పటేల్ ను కలిశారు... నూతన కార్యవర్గం ఏర్పడడం తో మర్యాద పూర్వక భేటీ అయ్యారు... మున్నూరు కాపు ఫంక్షన్ హల్ మరమ్మత్తులకు నిధులు ఇవ్వాలని కోరగా ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు..నూతనంగా ఎన్నికైనా సంఘ నాయకులందరిని శాలువతో సత్కరించి, ఐక్యంగా అభివృద్ధి సాధించాలని సూచించారు...

## ఫ్లాష్ న్యూస్ ....ఫ్లాష్ న్యూస్ ....

**సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి కీలక సమావేశం**

**పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలతో కొనసాగుతున్న సమావేశం**





**మంచిర్యాల, 28, సెప్టెంబర్ (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన, మంత్రి శ్రీధర్ బాబు మంత్రి వివేక్ వెంకటస్వామి మరియు కోల్‌బెల్ట్ ప్రాంతానికి చెందిన ఎమ్మెల్యేలతో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, కార్మికుల సంక్షేమం మరియు ఎన్నికల హామీల అమలుపై కీలక సమావేశం సోమవారం రాత్రి ప్రారంభం అయ్యి ఇంకా కొనసాగుతున్నది. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్ మరియు ఐఎన్టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నేతృత్వంలోని ఐఎన్టియుసి బృందం నాయకులు ఇందులో పాల్గొన్నారు .ఈ సమావేశంలో ఐఎన్టియుసి సెంట్రల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్, శ్రీరాంపూర్ ఏరియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జెట్టి శంకర్ రావు పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపడం, కార్మికుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేయడం మరియు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై సమావేశంలో చర్చ కొనసాగుతున్నట్లు నాయకుల ద్వారా సమాచారం అందింది. ఈ సమావేశం లో సింగరేణి డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి ,డైరెక్టర్ (ఫా ) గౌతం పోట్రు ఇతర సింగరేణి డిరెక్టర్లు అధికారులు కూడా పాల్గొన్నారు. మరి ఈ ముఖ్య సమావేశం లో సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారో ..?..ఎలాంటి తీపి కబురు అందుతుందో అని కార్మిక వర్గం ఆశగా ఎదురు చూస్తున్నారు .

# రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి


**కలెక్టర్లు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలించాలి**

**ఫుడ్ పాయిజనింగ్, పాముకాటు వంటి ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి**

**దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా చర్యలు**

**రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీ.ఎస్ సమీక్ష రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,సెప్టెంబర్ 28 ,( ప్రజాజ్యోతి ).**రాష్ట్రంలోని పాఠశాల విద్య, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల పరిధిలోని అన్ని రెసిడెన్షియల్ విద్యా సంస్థలను పటిష్టంగా పర్యవేక్షిస్తూ, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణ, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో.సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, మెరుగైన విద్యాబోధనతో పాటు మౌలిక వసతులపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. రెసిడెన్షియల్ స్కూల్స్/కళాశాలలను క్రమం తప్పకుండా ఆకస్మికంగా తనిఖీ చేస్తూ, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో ఆహారం తయారీ, ఆహార పదార్థాల నిల్వ, వినియోగంలో నిర్దేశిత ప్రామాణిక నిర్వహణ విధానాలను తప్పనిసరిగా పాటించేలా చూడాలన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, మౌలిక వసతుల లోపాలు తదితర అంశాలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అన్నారు. సాధ్యమైన చోట్ల వంటశాలల ఆధునీకరణ పనులను వీలైనంత త్వరగా చేపట్టాలని సూచించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఉన్నతస్థాయిలో పర్యవేక్షించేందుకు రూపొందించిన డ్యాష్‌బోర్డ్‌ను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించాలని తెలిపారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా, ఏవైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి, వాటి వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో చేపట్టిన మార్పులు, సమస్యల పరిష్కార చర్యలను కూడా పోర్టల్‌లో





నిరంతరం అప్‌డేట్ చేయాలని సూచించారు.జిల్లాలో రెసిడెన్షియల్ విద్యాసంస్థలకు సంబంధించి ఏదైనా ప్రతికూల నివేదిక వచ్చినప్పుడు సంబంధిత అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సీఎస్ సూచించారు. తప్పుడు సమాచారం ప్రచారంలో ఉన్నట్లు తేలితే నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, వాస్తవంగా ఏదైనా సమస్య ఉన్నట్లు నిర్ధారణ అయితే వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు, కాస్మెటిక్ ఛార్జీలను పెంచి అమలు చేస్తోందని, కాస్మెటిక్ ఛార్జీలను ప్రస్తుతం డీబీటీ ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు.రానున్న శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో విద్యార్థులకు స్నానానికి వెచ్చని నీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన దుప్పట్లను ముందుగానే సమకూర్చాలని పేర్కొన్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ విద్యాసంస్థల భవన యజమానులతో కలెక్టర్లు సమావేశమై అవసరమైన మార్పులు, మరమ్మతులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.దసరా నాటికి ప్రతి విద్యార్థికి రెండు జతల కుట్టిన యూనిఫారాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. యూనిఫాం క్లాత్ ఇప్పటికే జిల్లాలకు చేరినందున కుట్టు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.రెసిడెన్షియల్ విద్యాసంస్థల నిర్వహణకు సంబంధించిన అన్ని అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తూ, క్షేత్రస్థాయిలో చేపట్టిన చర్యలు, సమస్యల పరిష్కార వివరాలను ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌లో క్రమం తప్పకుండా నవీకరించాలని ఆదేశించారు.నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయం నుంచి ఈ వీసీలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తున్నామని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతీ వారం సందర్శిస్తూ, క్షేత్రస్థాయిలో వారు పరిశీలించిన అంశాలను ఎప్పటిప్పుడు నివేదిస్తున్నారని, తదనుగుణంగా రెసిడెన్షియల్ విద్యా సంస్థల నిర్వహణ మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లాలో ఇప్పటివరకు ఎక్కడ కూడా కలుషిత ఆహారం, పాముకాటు వంటి ఘటనలు చోటుచేసుకోలేదని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల పర్యవేక్షణ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సుర్జాపూర్ పరిసర అడవి ప్రాంతాల్లో పులి సంచారం ఆందోళనలో ప్రజలు

**అప్రమత్తంగా ఉండాలంటున్నా**

**అటవీశాఖ అధికారులు**

**ఖానాపూర్ సెప్టెంబర్ 28 (ప్రజాజ్యోతి)** ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ పరిసర అడవి ప్రాంతాల్లో పులి సంచారం ఈ ప్రాంత ప్రజల్ని ఆందోళనకు గురిచేస్తుంది నీ మేరకు అటవీశాఖ అధికారులు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తో పాటు మామడ మండలాల సరిహద్దు అటల్ ప్రాంతాలైన ఖానాపూర్ పట్టణంలోని సుర్జాపూర్ గ్రామపంచాయతీ వెంకటాపూర్ మామిడా మండలంలోని నలుదుర్తి గ్రామ సమీపంలోని భీమన్న ఆలయ కొండ వైపు అటవీ ప్రాంతాల్లో పులి సంచారం చేస్తున్నట్టు పాదా గుర్తులు కనుగొన్నట్టు బీట్ ఆఫీసర్ నరేందర్ గ్రామస్తులతో సమావేశం అయ్యారు ఈ రెండు మండలాలలోని ప్రజలు అప్రమత్తంగా ఉండి అడవిలోకి పశువుల కాపరులు పశువులను తీసుకెళ్లరాదని హెచ్చరికలు జారీ చేశారు ఉన్నతాధికారులతో చర్చించి పులి సంచార విషయాన్ని పూర్తి సందేశాలను ప్రజలకు అందించే వరకు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులతో సమావేశమై చర్చించారు ఏది ఏమైనా ప్రజలు పరిసర ప్రాంతాల అటవీ ప్రాంతాల్లో వ్యవసాయం చేసుకున్న రైతులు సుప్రభాతం గా ఉండి పరిసర వెంకటాపూర్ నందుర్తి ఖానాపూర్ మామడ మండల ప్రజలు జాగ్రత్త వహించాలని కోరారు



# విద్యా ప్రమాణాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి









## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు

**ఆదిలాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 28,(ప్రజా జ్యోతి)** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన మౌలిక వ సతులు, సౌకర్యాలు కల్పించడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధా న కార్యదర్శి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలు, కళా శాలలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, భోజనం, పారిశుద్ధ్యం, వంటశాలలు ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు తదితర అంశాలను ఆయా జిల్లాల కలెక్టర్లు, నియమిత అధికారులు తరచూ క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేయాలని, విద్యార్థుల లెర్నింగ్ ఔట్‌కమ్స్ మెరుగుపడేలా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం, పురోగతిని క్రమంతప్పకుండా సమీక్షించాలని, 2027 విద్యా సంవత్సరం నాటికి కనీసం 15 నుంచి 20 పాఠశాలలను పూర్తి చేసేలా చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. విద్యార్థులకు అందించే డైట్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన నేపథ్యంలో, పెంచిన సౌకర్యాలు విద్యార్థులకు సక్రమంగా అందేలా అధికారులు పర్యవే క్షించాలని తెలిపారు. పాఠశాలలలో ప్రాథమిక వసతు లను అందుబాటులో ఉం చాలని, పారిశుద్ధ్య నిర్వహణ, వంటశాలల పరిశుభ్రత, నాణ్యమైన ఆహార సరఫరా పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆహార కలుషిత సంఘటనలు, విద్యార్థుల ఆత్మహత్యాయత్నాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ గుర్తింపు వ్యవస్థ (ఎ ఫ్ ఆర్ ఎస్) ద్వారా హాజరు నమోదును సమర్థవంతంగా అమలు చేయాలని, ఉపాధ్యాయుల హాజరును క్రమం తప్పకుండా సమీక్షించి ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల హాజరు ను కూడా కలెక్టర్లు పర్యవే క్షించి, హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, గిరిజన, వెనుకబడిన తరగతులు, అల్ప సంఖ్యాక వర్గాలు, సాధారణ సంక్షేమ వసతి గృహాలకు సంబంధించి మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు భోజనం, పారిశుద్ధ్యం, ఇతర సౌకర్యాలు, చేపడుతున్న చర్యలను ఒకే సమగ్ర మానిటరింగ్ పోర్టల్ ద్వారా పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నిర్మాణంలో ఉన్న కేంద్రీ కృత వంటశాలల పనులను వేగవంతం చేసి, నవంబర్ మధ్య నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థుల యూనిఫారాల త యారీ ప్రక్రియను వేగవంతం చేసి, అక్టోబర్ 20వ తేదీ నా టికి ప్రస్తుత యూనిఫారాల తయారీ పూర్తి చేయాలని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన యూనిఫారాల ను వచ్చే ఏడాది మే 30 నాటికి సిద్ధం చేసేలా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలలోని కంప్యూటర్ ల్యాబ్‌లను సమీక్షించి, విద్యార్థుల విద్యాభ్యాసానికి పూర్తిస్థాయిలో వినియోగించేలా చూడాలని తెలిపారు. యు - డైస్ డేటాలో సుమా రు 70--80 వేల మంది విద్యార్థులు డ్రాప్ బాక్స్‌లో ఉన్న నేపథ్యంలో, సంబంధిత వివరాలను పరిశీలించి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని తెలిపారు. సమగ్ర శిక్ష, ప్రధానమంత్రి శ్రీ కార్యక్రమాల క్రింద మంజూరైన నిధుల వినియోగాన్ని సమీక్షించి, నిధులు నిర్దేశిత ప్రయోజనాలకు సక్రమంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు తరచూ పాఠశాలలు, కళాశాలలను సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, వంటశాలల పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యత, సరఫరా, విద్యార్థుల సౌకర్యాలను స్వయంగా పరిశీలించాలని తెలిపారు. ప్రభుత్వ విద్య, సంక్షేమ కార్యక్రమాల ద్వారా జరుగుతున్న మంచి పనులను ప్రజలకు తెలియ జేసేలా సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలె క్టరేట్ వీసీ హాల్ నుండి జిల్లా కలెక్టర్ రాజర్షిషా, డిఈఓ మాధవి, డిబిసిడిఓ సోనియా, డిఎస్సీడిఓ సునీత కుమారి, డిఎండబ్ల్యుఓ కలీ మ్, గిరిజన సంక్షేమ శాఖ డిడి అశోక్, బాలికల ఎస్సీ రెసిడెన్షియల్, ఏంజెపి పాఠశాల, కళాశాలల ప్రిన్సిపాల్‌లు లలిత కుమారి, కీర్తి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామకంతం భూములపై సీఆర్డీఏ క్లారిటీ..

## మినహాయింపులకు కటాఫ్ తేదీ ఇదే

**విజయవాడ :** ఏపీ రాజధాని అమరావతి పరిధిలోని గ్రామకంతం మినహాయింపులపై సీఆర్డీఏ శనివారం స్పష్టత ఇచ్చింది. 08-12-2014ను కటాఫ్ తేదీగా నిర్ణయించి.. ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు చేసుకున్న ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిశీలన చేసినట్లు తెలిపింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని సీఆర్డీఏ తెలిపింది. ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్‌పీఎస్ నుంచి మినహాయించినట్లు సీఆర్డీఏ తెలిపింది. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు పేర్కొంది. రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. తాజా అప్లికేషన్లు, అభ్యంతరాలను జేసీ ఆధ్వర్యంలోని కమిటీ పరిశీలించి ఖరారు చేస్తుందని సీఆర్డీఏ ఓ ప్రకటనలో తెలిపింది. అర్హులైన రైతులకు నిబంధనల ప్రకారం అన్ని ప్రయోజనాలు అందిస్తామని తెలిపింది. విజయవాడలో దశాబ్దాల నాటి ఇళ్ల పట్టాల సమస్యకు ఏపీ ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించింది. పేదల సొంతింటి కలకు భరోసా కల్పించేందుకు రెడీ అయింది. విశాఖలో 28,445 కుటుంబాలకు పట్టాలిచ్చిన తరహాలో ఈనెల 30న విజయవాడలో మరో భారీ కార్యక్రమం చేపట్టనుంది. 24,057 కుటుంబాలకు రూ.9,800 కోట్ల విలువైన భూమిపై క్రమబద్ధీకరణ పట్టాలను సీఎం చంద్రబాబు అందించనున్నారు. ఎన్టీఆర్ హయాంలో ఇచ్చిన పట్టాలకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ పేదల సొంతింటి కలను నెరవేర్చనున్నారు. ఇళ్ల పట్టాల పంపిణీతో ఒక్కో కుటుంబానికి సుమారు రూ.40 లక్షల నుంచి రూ.45 లక్షల వరకు ప్రయోజనం చేకూరనుంది. తమ ఇళ్లకు శాశ్వత హక్కులు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా పేద ప్రజలు కోరుతున్నారు. వారి కల సాకారం నేడు సాకారం కానుంది. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలో ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. మొత్తం 15 మండలాల్లోని 617 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న 29.86 లక్షల చదరపు గజాల స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణీ చేయనుంది.

## ఎన్ఆర్ఐల భూములే టార్గెట్

**విజయవాడ :** కృష్ణా జిల్లా పెనమలూరులో మోసం బయటపడింది. ఎన్ఆర్ఐల భూములే టార్గెట్ చేస్తూ వాటిని అమ్మి సొమ్ము చేసుకుంటున్న గ్యాంగ్‌ని పోలీసులు అరెస్ట్ చేశారు. మొత్తం ఐదుగురుని అదుపులోకి తీసుకున్నారు. రీసెంట్‌గా విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన బిక్కిన సుబ్బారావుకు సంబంధించిన 800 గజాల భూమిని కొట్టేయడానికి ప్లాన్ చేసుకున్నారు. అయితే ఈ విషయం తెలుసుకున్న సుబ్బారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తు చేసి ముఠాను అరెస్ట్ చేశారు. ఈ గ్యాంగ్‌లో ఇంకొందరు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు.కృష్ణా జిల్లా పెనమలూరులో ఘరానా మోసగాళ్లను పోలీసులు అరెస్ట్ చేశారు. ఔఖీఎల పొలాలను, భూములను టార్గెట్ చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బతికి ఉన్నవారు మరణించినట్టు సర్టిఫికెట్లను సృష్టించి, వారికి నకిలీ వారసులను కూడా సిద్ధం చేసి భూములను కొట్టేయడం వీరి పని. అరెస్టైన వారిలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు చెందిన ఎం.ఆదిరెడ్డి, ఎం.వెంకట రమణ ఫణి కుమార్, సాంబశివ ఉదయ భాస్కర్, శివ ఆంజనేయులు, అమలేశ్వర రావు ఉన్నారని గన్నవరం డీఎస్పీ ధర్మేంద్ర తెలిపారు.విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన బిక్కిన సుబ్బారావు దంపతులకు కానూరులో స్థలం ఉంది. వారి కుమార్తె హిమబిందు అమెరికాలో ఉంటున్నారు. ఈ ఫ్యామిలీ విషయం తెలుసుకున్న నిందితులు వారి 833 గజాల స్థలాన్ని స్వాహా చేసేందుకు ప్లాన్ చేశారు. ఇందులోభాగంగా నిందితులు బాధితుడి డాక్యుమెంట్ జెరాక్స్ కాపీని సంపాదించి బతికున్న సుబ్బారావు దంపతులు చనిపోయినట్టు ఫేక్ డెత్ సర్టిఫికెట్‌ను క్రియేట్ చేశారు. అమెరికాలో ఉన్న అసలు కుమార్తె స్థానంలో ప్రకాశం జిల్లాకు చెందిన మరో మహిళను తీసుకొచ్చి ఆమె పేరుతోనే నకిలీ కుటుంబ సభ్యుల సర్టిఫికెట్‌ను క్రియేట్ చేశారు. దాంతో ఆదిరెడ్డి పేరుతో జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ చేయించారు. అనంతరం ఆదిరెడ్డి తన గ్యాంగ్‌లోని మరో వ్యక్తికి ఈ స్థలాన్ని రిజిస్టర్ చేశారు. అయితే ఇక్కడే నిందితులకు ఊహించని ట్విస్ట్ ఎదురైంది. ఆ స్థలాన్ని ఓ వ్యక్తికి అమ్మేందుకు ప్రయత్నించగా అతను స్థలం పూర్వాపరాలను తెలుసుకున్నారు. దీంతో ఆ భూమి అసలు యజమాని బతికే ఉన్నట్టు తెలిసిపోయింది. తన భూమిపై అక్రమ లావాదేవీలు జరుగుతున్న తెలుసుకున్న అసలు ఓనర్ సుబ్బారావు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఈ దొంగ వ్యవహారాన్ని మొత్తం బయటకు తీశారుఈ గ్యాంగ్‌లో ఇంకొందరు పరారీలో ఉన్నారని, వారిని అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు.

# ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కరపత్రం విడుదల చేసిన ఐటీడీఏ పీఓ మంద మకరందు






**ఉట్నూర్, సెప్టెంబర్ 28, (ప్రజా జ్యోతి)** సమాజంలోని పేద, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండేలా ఉ చితన్యాయ సహాయంపై ప్రజల్లో అవగాహన కల్పించల్సిన అవసరం ఉందని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి మంద మకరందం అన్నారు.సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన "ఉచిత న్యాయ సహాయం" అవగాహన కరపత్రాన్ని ప్రాజెక్టు అధికారి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ భారత రాజ్యాంగంలోని అధికరణ 39–ఎ ప్రకారం ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించే అవకాశం కల్పించబడిందని తెలిపారు. ఆర్థిక పరిస్థితులు లేదా ఇతర కారణాల వల్ల ఎవరూ న్యాయం పొందే అవకాశాన్ని కోల్పోకూడదని పేర్కొన్నారు.

**ఉచిత న్యాయ సహాయా నికి అర్హులు**

జిల్లా న్యాయ సేవాసంస్థ నిబంధనల ప్రకారం కింది వ ర్గాలకు చెందిన వారికి ఉ చిత న్యాయ సహాయం అం దించబడుతుందని పీఓ తెలిపారు.షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీ)కు చెందిన వారు.మానవ అక్రమ రవాణా బాధితులు, బేగారీ బాధితులు. మహిళలు, పిల్లలు,మాన సిక వైకల్యం లేదా ఇతర అంగవైకల్యం ఉన్నవారు. సామూహిక విపత్తులు, హింసాకాండ, కుల వైష మ్యాలు, వరదలు, కరువు, భూకంపాలు తదితర ప్రకృ తి లేదా పారిశ్రామిక విపత్తుల బారిన పడినవారు.పారిశ్రామిక కార్మికులు.వివిధ సంరక్షణ కేంద్రాలు, మానసిక చికిత్సాలయాల్లో ఉన్న వ్యక్తులు,వార్షిక ఆదాయం రూ.3 లక్షలలోపు ఉన్న అర్హత కలిగిన ఇతర వ్య క్తులు అర్హులని వివరించారు.

**అందించే న్యాయ సేవలు**

అర్హులైన వారికి ఉచిత న్యాయ సలహాలు అందించడం, కోర్టు కేసుల కోసం ఉచితంగా న్యాయవాదులను నియమించడం, అవసరమైన కోర్టు ఫీజులను భరించడం, తీర్పుల నకళ్లను ఉచితంగా అందించడం వంటి న్యాయ సేవలు అందుబాటులో ఉం టాయని తెలిపారు.

**దరఖాస్తు చేసుకునే విధానం**

ఉచిత న్యాయ సహాయం పొందేందుకు అర్హులైన వారు తమ సమస్యకు సంబంధించిన వివరాలతో మండల స్థాయిలో మండల న్యాయ సేవా సంఘం (మండల కోర్టు భవనాలు)ను లేదా జిల్లా స్థాయిలో జిల్లా న్యాయ సేవా సంస్థ (కోర్టు భవనాలు,ఆదిలాబాద్––504001) కార్యదర్శిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని పీఓ సూచించారు.గిరిజన ప్రాంతాల్లోని ప్రజలు, ముఖ్యంగా పేదలు, బలహీన వర్గాలకు చెందిన వారు తమకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సహాయ సేవలపై అవగాహన పెంచుకుని, అవసరమైనప్పుడు ఈ అవకాశాన్ని సద్వినియోగంచే సుకోవాలని ప్రాజెక్టు అధికారి మంద మకరందం కోరారు.ఈ కార్యక్రమంలో ఐటీ డీఏ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మూడో ఉపఎన్నిక తప్పదా...

**హైదరాబాద్ :** తెలంగాణలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలలో తొలి వికెట్ కింద ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మీద అనర్హత వేటు పడింది. దీంతో దీని ఉప ఎన్నిక ఎప్పుడు ప్రకటిస్తారో అన్న ఉత్కంఠ నెలకొన్నది. నిబంధనల ప్రకారం ఖాళీ అయిన ఆరు నెలల్లోగా ఎన్నికలు నిర్వహించాలి. ఈ లెక్కన 2027 మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ఉప ఎన్నికలు జరగవచ్చని భావిస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్పీకర్ ఖైరతాబాద్ సీటు ఖాళీ అయిందని ఎన్నికల సంఘానికి త్వరలో సమాచారం అందించనున్నారు. ఆ తర్వాత ఎన్నికల కమిషన్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేస్తుందని తెలుస్తోంది! ఈ ఏడాది డిసెంబరులో గుజరాత్, వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గుజరాత్ ఎన్నికలతో పాటు, లేదా మిగతా రాష్ట్రాల ఎన్నికలతో పాటు ఖైరతాబాద్ ఎన్నిక నిర్వహిస్తారని భావిస్తున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సికింద్రాబాద్ కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో జరిగిన ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ విజయం సాధించారు. ఆ తర్వాత జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మరణంతో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించాడు. ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల నేపథ్యంలో ఖైరతాబాద్ ఉప ఎన్నిక రావడంతో ఎవరు గెలుస్తారు అన్న ఉత్కంఠ మొదలైంది. సుప్రీం తీర్పు నేపథ్యంలో ఎన్నికలకు సిద్ధం అని అనర్హత వేటు పడిన దానం నాగేందర్ ప్రకటించారు. ఎన్నికలు నాకు కొత్త కాదు. ఖైరతాబాద్ నా కోట. ప్రజల మద్దతు ఉంది అని దానం అంటున్నారు.

## మేడారం జాతర తేదీల ఖరారు

**వరంగల్ :** వన దేవతలు మేడారం సమ్మక్క సారక్క భక్తులకు వడ్డెర పూజారుల సంఘం శుభవార్త అందిం చింది. మినీ మేడారం జాతర నిర్వహణ తేదీలు అధికారికంగా ఖరారయ్యా యి. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మేడారంలో జరిగే శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతర ఫిబ్రవరి 17న ప్రారంభం కానుందని "మేడారంలోని పూజారుల (వడ్డెలు) సంఘం తెలిపింది. ప్రతినిధులు, నాయకులు మేడారం మినీ జాతర తేదీలను నిర్ణయించి అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు 4 రోజులపాటు జరగనున్న మినీ జాతర ఏర్పాట్లు, నిర్వహణ వివరాలను తెలియజేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు లేఖ ద్వారా సమాచారాన్ని అందించారు.

మినీ జాతర తేదీలు (ఫిబ్రవరి 2027) ఖరారు

17.02.2027 (బుధవారం): మేడారం మినీ జాతర ప్రారంభం, ప్రత్యేక పూజలు.

18.02.2027 (గురువారం): అమ్మవార్ల ఉత్సవాలు, భక్తులకు దర్శనాలు.

19.02.2027 (శుక్రవారం): భక్తుల రద్దీ, జాతరలో ప్రధాన పూజా కార్యక్రమాలు.

20.02.2027 (శనివారం): మినీ జాతర ముగింపు వేడుకలు నిర్వహించున్నారు

ఈ 4 రోజుల పాటు మేడారంలో వనదేవతలైన సమ్మక్క–సారలమ్మల ఉత్సవాలు, వైదిక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. జాతరకు తరలి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు పూజారుల సంఘం ప్రతినిధులు, వడ్డెరలు ఈ వివరాలను లేఖపై సంతకాలు చేసి ప్రభుత్వానికి

## పాప హరీశ్వర ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక సమావేశం



**బాసర సెప్టెంబర్ 28 (ప్రజా జ్యోతి)** బాసర లోని పాప హరీశ్వర ఆలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక సమావేశం. నిర్వహించారు పాప హరేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనుల లెక్కలు, భవిష్యత్తు అభివృద్ధి పనులు తదితర అంశాలపై సర్పంచ్ వెంకటేష్ గౌడ్ అధ్యక్షతన చర్చించిన ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాపహరేశ్వర ఆలయంలో అన్నదానం నిర్వహించారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్ గౌడ్ మాజీ సర్పంచ్ లక్ష్మణ రావు మాజీ పిఎసిఎస్ చైర్మన్ నూకం రామారావు గంగారావు ధర్మారావు రిటైర్డ్ టీచర్ గంగాధర్ సంజీవరావు రఘు పటేల్ మల్కన ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి

**ఐటీడీఏ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు**



**ఉట్నూర్, సెప్టెంబర్ 28, (ప్రజా జ్యోతి)** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న దరఖాస్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో ప రిశీలించి, సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిం చేలా చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి మంద మకరందు అధికారులను ఆదే శించారు. సోమవారం ఐటీడీ ఏకార్యాలయంలో నిర్వ హించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల విన తులను ఆయన స్వీకరించి, సంబంధిత శాఖల అధికారులకు పరిశీలించి తగిన చ ర్యలు తీసుకోవాలని సూచించారు.ఉట్నూర్ మండలం హస్నాపూర్ గ్రామానికి చెందిన రవి తనకి ఆటో లోన్ మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఆదిలాబాద్ మండలం పెద్ద బోరిగామ్ గ్రామానికి చెంది న గ్రామస్తులు తమ గ్రామా నికి సి సి రోడ్డు షెడ్డు మంజూరు చేయాలని కోరారు. నార్నూర్ మండలం ఏంపల్లి గ్రామానికి చెందిన మాడవి రాజు తనకు గొర్రెల లోన్ మంజూరు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఉట్నూర్ మండలం చిన్న గంగపూర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య తన కు ఇందిరమ్మ ఇళ్ళు కొరకు దరఖాస్తు అందజే శారు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల లబ్ధి, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారం తది తర అంశాల పై తమ వినతి పత్రాలను సమర్పించారు.ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖ అధికారులు బాధ్య తాయుతంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరిత గతిన పరిష్కరించాలని ప్రాజెక్టు అధికారి మంద మకరందు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.